
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5



కృష్ణా
జిల్లా వార్తలు
ఆదివారం 1 డిసెంబరు 2024

కంకిపాడులో రోడ్డు ప్రమాద దృశ్యం



విధి ఎవరిని ఎప్పుడు ఎలా బలి తీసుకుంటుందో ఎవరికీ తెలియదు. అప్పటివరకు కారులో సరదాగా కబుర్లు చెప్పుకొంటూ బయల్దేరిన ముగ్గురు స్నేహితులు అనుకోని ప్రమాదానికి గురై మృతిచెందగా, తనయుడి మృతివార్త విని ఓ తల్లి గుండె పగిలి చనిపోయింది. హృదయవిదారకమైన ఈ విషాద సంఘటన కంకిపాడులోని జాతీయ రహదారిపై జరగ్గా, మృతులు మచిలీపట్నానికి చెందినవారు.

విషాదం

కంకిపాడులో రోడ్డు ప్రమాదం.. ముగ్గురు స్నేహితుల దుర్మరణం

తనయుడి మృతివార్త విని తల్లి మృతి

- మృతులు మచిలీపట్నంలోని బలరామునిపేటకు చెందినవారు
- మందుల కోసం విజయవాడ వచ్చి వెళ్తుండగా ప్రమాదం



చీలి ఏసుబాబు (ఫైల్)



చీలి భాను (ఫైల్)



చింతా రవిబాబు (ఫైల్)

మచిలీపట్నం టౌన్/కంకిపాడు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నంలోని బలరామునిపేటకు చెందిన ప్రైవేట్ ఉద్యోగి చింతా రవిబాబు (35) తన తండ్రి రామారావుకు విజయవాడ నుంచి మందులు తెచ్చేందుకు బయల్దేరాడు. స్నేహితులు.. బైక్ ఫైనాన్సర్ చీలి ఏసుబాబు (27), రైల్వే కాంట్రాక్టు ఉద్యోగి చీలి భాను (26)తో కలిసి కారులో శనివారం ఉదయం విజయవాడ వెళ్లారు. సాయంత్రం 4.30 గంటల సమయంలో కంకిపాడు రెండో ఫ్లైఓవర్ వద్దకు రాగా, కారులో ఓ చక్రానికి గాలిపోయి అదుపుతప్పింది. మచిలీపట్నం నుంచి విజయవాడ వైపు వస్తున్న చేపల లోడువ్యానును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏసుబాబు, రవిబాబు, భాను అక్కడికక్కడే మృతిచెందారు. కారులో ఉన్న ఇద్దరు ఎగిరి రోడ్డుపై పడి చనిపోయారు. మరో వ్యక్తి సీటులోనే ఇరుక్కుపోవడంతో మృతిచెందాడు. ఈ ఘటనలో రెండు వాహనాలు ధ్వంసమయ్యాయి. వ్యాను డ్రైవర్ కురెళ్ల కిషోర్ (26) వాహనంలోనే ఇరుక్కుపోయాడు. బాధ భరించలేక కిషోర్ హాహాకారాలు చేశాడు. కిషోర్‌ను బయటకు తీసేందుకు పోలీసులు గంటపాటు శ్రమించారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్సై సందీప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, సంఘటనా మిగతా 6లో..

ఫెంగల్ తుఫాను జిల్లాలో అలజడి సృష్టిస్తోంది. శుక్రవారం ఓ మోస్తరు వర్షంతో రైతులను కంగారు పెట్టించిన ఈ తుఫాను.. శనివారం కూడా విడతలవారీగా కురిసి పరుగులు పెట్టించింది. రోడ్లపై వేసిన ధాన్యపు రాశుల కిందకు వర్షపు నీరు చేరుతుండటం, ధాన్యాన్ని మిల్లులకు తరలించే అవకాశం లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో మరింత ఆవేదన చెందుతున్నారు.



పామర్రు మండలం జమీగొల్వేపల్లిలో ధాన్యపు బస్తాలను మిల్లులకు తరలిస్తూ..

గుడివాడ మండలం బొమ్ములూరులో రోడ్ల వెంబడి ధాన్యపు రాశులు



ఫెంగల్ కలవరం

జిల్లాలో మోస్తరు వర్షాలు.. అన్నదాతలు అతలాకుతలం

- రహదారులపై రాశులుగా పోసిన ధాన్యం
- టార్పాలిన్ పట్టాల కిందకు చేరుతున్న వర్షపునీరు
- ధాన్యం మొలకెత్తే అవకాశం ఉందని బెంబేలు
- మిల్లులకు తరలించే దారిలేక రైతుల అవస్థలు
- నేలవాలుతున్న కోతకు సిద్ధంగా ఉన్న వరి
- మినుము కూడా చనిపోయే ప్రమాదం

మరో రెండు రోజులు వర్షాలు : వాతావరణ శాఖ



ఈదురుగాలులకు కూచిపూడిలో ఒరిగిన వరిచేను

ఆంధ్రజ్యోతి, మచిలీపట్నం : ఫెంగల్ తుఫాను రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఇప్పటికే యంత్రాల ద్వారా కోసిన ధాన్యాన్ని రాశులుగా పోసి ఉంచారు. రెండు, మూడు రోజుల పాటు వర్షాలు కురిస్తే ధాన్యం తడిచిపోతుందని భయపడిపోతున్నారు. కోత కోయకుండా ఉన్న పంట వర్షం కారణంగా తడిచి.. కంకులు బరువెక్కి.. నేలవాలిపోతే, దానిపైకి నీరు చేరితే పంట చేతికి అందదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తుఫాను ప్రభావానికి శుక్రవారం మధ్యాహ్నం నుంచి విడతలవారీగా వర్షం కురిసింది. శనివారం రాత్రి వరకు ఓ మోస్తరు వర్షం కురుస్తూనే ఉంది. దీంతో రైతుల్లో అలజడి రెట్టింపైంది. గత ఏడాది డిసెంబరులో సంభవించిన మిచౌంగ్ తుఫానును గుర్తుచేస్తూ ఫెంగల్ కూడా బీభత్సం సృష్టిస్తుందేమోనని కలవరపడుతున్నారు.

1.10 లక్షల హెక్టార్లలో పంట చేతికొచ్చే దశలో..

ఈ ఖరీఫ్‌లో జిల్లాలో 1.65 లక్షల హెక్టార్లలో వరి సాగైంది. ఇప్పటివరకు 26 వేల హెక్టార్లలో కోతలు పూర్తయ్యాయి. కాల్వల శివారు భూముల్లో ఆలస్యంగా వరినాట్లు వేసిన 25 వేల హెక్టార్లలో వరిపైరు పొట్ట, వివిధ దశల్లో ఉంది. మరో 1.10 లక్షల హెక్టార్లలో కోతదశకు చేరుకుంది. డిసెంబరు 15లోగా ఈ విస్తీర్ణంలో అధికశాతం కోతలు పూర్తిచేయాల్సి ఉంది. తుఫాను ప్రభావంతో రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో పాటు మరో రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతుల వెన్నులో వణుకు మొదలైంది. వరికంకుల్లోని గింజలు గట్టిపడిన తరువాత పైరు తడిస్తే నేలవాలిపోయే ప్రమాదం ఉందని భయపడుతున్నారు. నేలవాలిన వరిపైకి నీరు చేరితే కంకులు మొలకెత్తుతాయని, దీంతో ధాన్యం రంగుమారడంతో పాటు నూకలయ్యే అవకాశం అధికంగా ఉంటుందంటున్నారు. వర్షాలకు తోడు బలమైన గాలులు వీయడంతో గుడివాడ, నందివాడ, ఉయ్యూరు తదితర ప్రాంతాల్లో పైరు నేలవాలింది. గూడూరు మండలంలోని లేళ్లగరువు, కలపటం, ముక్కొల్లు తదితర గ్రామాల్లో కోతకోసిన పనలపై ఉన్న వరి తడిచిపోయింది. చల్లపల్లి, మొవ్వ, పామర్రు తదితర మండలాల్లో కోతకోసి ఉన్న పొలంలోని పంటది కూడా ఇదే పరిస్థితి. పెదప్రోలు, కంసాలిపాలెం, మోపిదేవి తదితర ప్రాంతాల్లో రాశులుగా పోసి ఉన్న ధాన్యం తడవకుండా ఉండేందుకు ఆర్డీవో స్వాతి ఆధ్వర్యంలో శనివారం రైతులకు టార్పాలిన్ పట్టాలు అందజేశారు.

మినుముకూ కష్టాలే..

శ్రీకాకుళం, ఒడిశా తదితర ప్రాంతాల నుంచి వచ్చిన వలస కూలీలతో మిగతా 6లో..

పంట రక్షించుకునేందుకు నానా పాట్లు

- ధాన్యం ఆరబెట్టుకుంటూ.. పరదాలు కప్పుకొంటూ రైతుల అవస్థలు 6లో

ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

- కరకట్ట బస్సు ప్రమాద ఘటనలో అతనే డ్రైవర్
- శిక్షణ నిమిత్తం మచిలీపట్నం డీపీటీవో వద్దకు..
- కించపరిచేలా మాట్లాడిన డీపీటీవో
- పురుగుల మందు తాగిన అవనిగడ్డ డిపో డ్రైవర్
- అధికారుల బెదిరింపులే కారణమని నోట్



8లో

మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్‌కు ఘన వీడ్కోలు 6లో



జీవవైవిధ్య నాణేలు

కాయిన్ ఎక్స్‌పోలో ప్రత్యేకం

సాధారణంగా నాణేలంటే ఏ చిల్లర పైసలో, పురాతనకాలం నాటివో, ప్రస్తుతం వాడుకలో ఉన్నవో, భవిష్యత్తులో రాబోయేవో ఇలా.. చాలా అనుకుంటాం. కానీ, కాలుష్యాన్ని తగ్గించి, పచ్చటి పర్యావరణానికి సూచికలుగా కూడా కొన్ని నాణేలు ఉన్నాయంటే నమ్మాల్సిందే. ఐక్యరాజ్య సమితిలో సభ్యత్వం కలిగిన కొన్ని దేశాలు ప్రపంచంలోని జీవవైవిధ్యాన్ని పరిరక్షించడానికి సదస్సులు నిర్వహించడమే కాకుండా ఒప్పందాలు కూడా చేసుకున్నాయి. ఈ సదస్సులు, ఒప్పందాల జ్ఞాపకార్థం ఆయా దేశాలు కొన్ని నాణేలను ప్రత్యేకంగా ముద్రించాయి. విజయవాడలోని సూర్యారావుపేట చిలుకు దుర్గయ్య వీధిలో ఏర్పాటుచేసిన ఇంటర్నేషనల్ కాయిన్ ఎక్స్‌పో 2024 (కాయిన్స్, స్టాంప్స్ అండ్ కరెన్సీ ఎగ్జిబిషన్)లో ఈ నాణేలన్నింటినీ మనం చూడొచ్చు. ఆదివారం వరకు అందుబాటులో ఉండే ప్రదర్శనలో ఈ జీవవైవిధ్య నాణేలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

సండే స్పెషల్

8

ఇసుక దుమారం

జెడ్పీ సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్రతో సభ్యుల వాగ్వాదం

- పోడియం వద్ద నిరసనలు తెలిపిన వైసీపీ సభ్యులు, ఎంపీపీలు
- జెడ్పీ సమావేశం రోజు ఎన్టీఆర్ జిల్లా సమీక్ష ఎలా అంటూ ప్రశ్న
- ఇసుక అక్రమాలపై విచారణ జరుపుతాం : మంత్రి కొల్లు రవీంద్ర
- రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజా కొంటామని హామీ



ఇసుక అక్రమ రవాణాపై పోడియం వద్ద ఆందోళన చేస్తున్న జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు. చిత్రంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, మంత్రి కొల్లు రవీంద్ర, జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలో లక్షలాది టన్నుల ఇసుకను అక్రమంగా తరలిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవట్లేదని, ఇసుక అక్రమ రవాణాపై సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు తీసుకుని, అధికారులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదని జిల్లా పరిషత్ సమావేశంలో సభ్యులు నిలదీశారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అధ్యక్షతన స్థానిక జెడ్పీ కన్వెన్షన్ హాల్లో శనివారం జిల్లా పరిషత్ సమావేశం జరిగింది. ఉమ్మడి జిల్లాలోని ఇసుక రేవుల నుంచి ఇసుకను అక్రమంగా తరలించుకుపోతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని, ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని కోరుతూ వైసీపీకి చెందిన జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు పోడియం వద్దకు వెళ్లి మంత్రి కొల్లు రవీంద్రతో వాగ్వివాదానికి దిగారు.

సమస్యలపై నిలదీయండి : జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక

మాజీ సీఎం వైఎస్ జగన్ సూచనల మేరకు జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై వైసీపీ సభ్యులు అధికారులను నిలదీయాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక సూచించారు. ధాన్యం కొనుగోలులో సక్రమంగా వ్యవహ రించకపోవడంతో పాటు వాతావరణం అనుకూలంగా లేని సమయంలో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆమె పేర్కొన్నారు. ఇసుక అక్రమ తవ్వకాలపై ఆమె మంత్రి కొల్లు రవీంద్రతో వాదనకు దిగారు.

ఫిర్యాదు చేస్తే విచారణ చేయిస్తామని మంత్రి హామీ ఇవ్వడంతో సభ్యులు శాంతించారు. ధాన్యం సకాలంలో కొనకుండా రైతులను ఇబ్బందుల పాలుచేయడం, తేమశాతం పేరుతో తక్కువ ధరకే ధాన్యాన్ని కొనడంపై ప్రజాప్రతినిధులు అధికారులను నిలదీశారు. జెడ్పీ సమావేశం రోజున ఎన్టీఆర్ జిల్లా సమీక్షా సమావేశం ఎలా ఏర్పాటు చేస్తారని సభ్యులు ప్రశ్నించారు.

ఇసుకమాయంపై నిరసన

కంచికచర్ల మండలం మాగల్లు, కీసర, కొండపల్లి, కంచల, మొగులూరు ఇసుక స్టాక్ పాయింట్లలో 2024, జూలై 27 వరకు ఎంతమేర ఇసుక నిల్వలు ఉన్నాయని సమాచార హక్కు చట్టం ద్వారా కోరగా, అధికారులు 4,43,641 టన్నులు ఉన్నట్టు చూపారని కంచికచర్ల జెడ్పీటీసీ సభ్యురాలు వేముల ప్రశాంతి తన వద్ద ఆధారాలను చూపారు. కొద్దికాలంలోనే ఈ ఇసుక నిల్వలు మాయం చేశారని, ఈ సంఘటనపై అధికారులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదని చెప్పారు. పోడియం వద్దకు వెళ్లి బైఠాయించారు. ఈ అంశంపై ఫిర్యాదు చేయకుండా చర్యలెలా తీసుకుంటామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఈ పత్రాలే ఆధారాలుగా భావించాలని ప్రశాంతి మంత్రితో వాగ్వివాదానికి దిగారు. వెంటనే వైసీపీకి చెందిన జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు పోడియం వద్దకు వచ్చి ఇసుకను మాయం చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. ఈ అంశంపై విచారణ చేయిస్తామని మంత్రి హామీ ఇవ్వడంతో సభ్యులు శాంతించారు. అవనిగడ్డ నియోజకవర్గం పులిగడ్డ మిగతా 6లో..

గ్రేటరే పరిష్కారం

డీఆర్‌సీ సమావేశంలో ఎంపీ కేశినేని శివనాథ్

- ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్, కమిషనర్లకు సూచన
- గ్రేటర్‌తో అనేక సమస్యలు పరిష్కారమవుతాయని వెల్లడి
- త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చిస్తామన్న ఎంపీ





డీఆర్‌సీ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్. చిత్రంలో ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, కలెక్టర్ లక్ష్మీశ, జేసీ నిధి మీనా, కమిషనర్ ధ్యానచంద్ర (ఇన్‌సెట్‌లో) సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, నాయకులు

గ్రేటర్ విజయవాడకు అడుగులు పడుతున్నాయి 'ఆంధ్రజ్యోతి'లో ఇటీవల ప్రచురితమైన 'మళ్లీ గ్రేటర్ ఆశలు' కథనంపై ప్రజాప్రతినిధులు స్పందించారు. గ్రేటర్ విజయవాడ జరక్కపోవటం వల్ల నెలకొన్న సమస్యలను ఏకరువు పెట్టడమే కాకుండా, పరిష్కారమయ్యే సమస్యలపైనా మాట్లాడారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : నగరంలోని రైతు శిక్షణా కేంద్రంలో శనివారం డీఆర్‌సీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఎంపీ కేశినేని శివనాథ్ గ్రేటర్ అంశం ప్రధానంగా మాట్లాడారు. ఎంపీ ప్రతిపాదనకు ప్రజాప్రతినిధులంతా సంఘీభావం తెలిపారు. దీనిపై నిర్ణయం తీసుకోవటానికి ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడతానని ఎంపీ స్పష్టం చేశారు.

కల సాకారం దిశగా..

రాష్ట్ర విభజన తర్వాత టీడీపీ ప్రభుత్వ హయాంలో 45 గ్రామాలను కలిపి గ్రేటర్ సిటీగా చేయటానికి ప్రతిపాదనలు తీసుకొచ్చారు. విలీన ప్రతిపాదిత పంచాయతీల తీర్మానాలను కూడా తీసుకున్నారు. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ తీర్మానాలను పక్కన పెట్టేసింది. తాజాగా టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో 'గ్రేటర్' అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ 'ఆంధ్రజ్యోతి'లో ఇటీవల కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో నూతన ప్రభుత్వం ఏర్పడ్డాక తొలిసారిగా శనివారం డీఆర్‌సీ సమావేశం జరిగింది. జిల్లాల పునర్విభజనలో భాగంగా గ్రేటర్ విలీన ప్రాంతాలను కృష్ణాజిల్లాలో కలపటం వల్ల తలెత్తిన సమస్యలపై ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడారు. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం గన్నవరంలో ఉందని, విజయవాడకు కూతవేటు దూరంలో ఉన్న ఈ విమానాశ్రయం కృష్ణాజిల్లాలోకి వెళ్లిందన్నారు. అమరావతికి వచ్చే వీవీఐపీలు, వీఐపీలు విజయవాడ మిగతా 6లో..

అధికారపక్షమే విపక్షంగా..

డీఆర్‌సీ సమావేశంలో సమస్యలు ఏకరువు

- రోడ్లు, గృహ నిర్మాణం, విద్య, వైద్యం, పారిశ్రామికం, పర్యాటకంపై చర్చ
- ప్రతిపక్షం లేకపోవటంతో అధికార పార్టీ సభ్యులదే ప్రధానపాత్ర
- శాఖలవారీగా సమీక్ష, ప్రజాప్రతినిధుల కీలక సూచనలు 8లో



నారాయణపురంలో వృద్ధులకు పింఛన్లు అందజేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి

పేదల పక్షాన కూటమి ప్రభుత్వం

» పింఛన్ల పంపిణీలో మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): 'పేదల పక్షాన కూటమి ప్రభుత్వం నిలబడి ఉంది. దేశంలోనే అత్యధిక పింఛన్ నగదు నెలకు వృద్ధులకు రూ.4వేలు పింఛన్ ఇస్తున్న రాష్ట్రమిది. ఒకటో తారీఖు ఆదివారం వచ్చిందని, ఈనెలలో ఒక రోజు ముందుగానే అందిస్తున్నాం.' అని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. శనివారం 46వ డివిజన్ నారాయణపురంలో కోదండ రామాలయం వద్ద ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణతో కలిసి ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. జిల్లాలో 2 లక్షల 70 వేల మందికి 80 శాతం పింఛన్లు ఉదయాన్నే పంపిణీ చేశామని మంత్రి తెలిపారు. మచిలీపట్నం నియోజకవర్గంలో 30,500 మందికి పంపిణీ చేశామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన 60 లక్షల మందికి పింఛన్లు ఇస్తోందని ఎంపీ వల్లభనేని బాలశౌరి తెలిపారు. త్వరలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు తెలిపారు. మునిసిపల్ కమిషనర్ బాపిరాజు పాల్గొన్నారు.

కృష్ణాజిల్లాలో 2.26 లక్షల మందికి రూ.96.29 కోట్లు

కృష్ణాజిల్లాలో 2.37 లక్షల మందికి రూ.101 కోట్లు పంపిణీ చేయాల్సి ఉండగా, శనివారం సాయంత్రానికి 2,26,351 మందికి రూ.96.29 కోట్లు పంపిణీ చేసినట్లు డీఆర్డీయే పీడీ కన్నయ్యనాయుడు తెలిపారు.



జూపూడిలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

ఎన్టీఆర్ జిల్లాలో 2, 31,127 మందికి

రూ.97.93 కోట్లు పంపిణీ

కృష్ణలంక, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా 2,31,127 మంది పింఛన్‌దారులకు రూ.97.93 కోట్లను అందజేసినట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. ఇబ్రహీంపట్నం మండలం జూపూడిలో వేకువజామునే వృద్ధాప్య పింఛన్‌దారుడు దొప్పలపూడి సాంబశివరావు, విభిన్న ప్రతిభావంతుల పింఛన్‌దారులు గౌరినేని శ్రీలేఖ, మొక్కపాటి సత్యశీల ఇంటి తలుపుతట్టి పింఛన్ సొమ్మును అందజేశారు. కొత్తగా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులను పరిశీలించి అర్హులందరికీ మంజూరు చేస్తామని ఆయన తెలిపారు. గతంలో వివిధ కారణాల వల్ల నిలిచిపోయిన వారి జాబితాను పునఃపరిశీలించి అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛన్ మంజూరు చేస్తామన్నారు. డీఆర్డీయే పీడీ కె.శ్రీనివాసరావు, ఎంపీడీవో సునీతశర్మ, తహసీల్దార్ వై.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



ఎంపీ కేశినేని చిన్నికి మొక్కను అందజేస్తున్న రైల్వే డీఈఆర్‌యూసీసీ సభ్యుడు పొలిశెట్టి లక్ష్మీ సత్యనారాయణశ్రేష్టి

మర్యాదపూర్వక కలయిక

వన్‌టౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)ను విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ తరఫున సౌత్ సెంట్రల్ రైల్వే డివిజనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ(డీఈఆర్‌యూసీసీ) సభ్యుడిగా నియమితులైన పొలిశెట్టి లక్ష్మీసత్యనారాయణ శ్రేష్ఠి మర్యాదపూర్వకంగా కలిశారు. గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో శనివారం ఎంపీకి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఆయనతో పాటు ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేశ్, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు గద్దం రవి, వీవీకే నరసింహారావు, సీఎల్ అరుణ్ పాల్గొన్నారు.

సీపీఎం సీనియర్ నేత

గాదె సుబ్బారెడ్డి కన్నుమూత



చల్లపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సీపీఎం సీనియర్ నాయకుడు, ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాదె సుబ్బారెడ్డి(68) గుండెపోటుతో శనివారం ఉదయం కన్నుమూశారు. సుబ్బారెడ్డి గతంలో దివి డివిజన్ సీపీఎం కార్యదర్శిగా మూడేళ్లపాటు పనిచేశారు. దివి ప్రాంతంలో నిర్వహించిన ప్రజాఉద్యమాల్లో ఆయన చురుకుగా పాల్గొన్నారు. ప్రజా కళాకారునిగా ప్రజానాట్యమండలిని అభివృద్ధి చేయడంలో సుబ్బారెడ్డి పాత్ర ప్రముఖమైనది. టామీ టామీ వీధి నాటికలో ఆయన ధరించిన పాత్ర ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకునేది. సుబ్బారెడ్డికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సుబ్బారెడ్డి అకాలమరణం పట్ల దివి డివిజన్ సీపీఎం నేతలు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఉండవల్లిలో ఆయన భౌతికకాయాన్ని సందర్శించి సీపీఎం నాయకులు యద్దనపూడి మధు, శీలం నారాయణరావు, వాకా రామచంద్రరావు, చేబ్రోలు బసవపూర్ణ, బండి ఆదిశేషు, పోలాబత్తిన మోహనరావు, మహమ్మద్ కరీముల్లా, వెనిగళ్ల వసంతరావు, నంద్యాల ఏసుప్రభు, బందారు కోటేశ్వరరావు నివాళులర్పించారు.

గ్రేటరే పరిష్కారం

(5వ పేజీ తరువాయి)

విమానాశ్రయానికి వస్తారని, కానీ, 65 కిలోమీటర్ల దూరం నుంచి పోలీసులు, జిల్లా యంత్రాంగ అధికారులు ఇక్కడికి వచ్చి ప్రొటోకాల్ విధులు నిర్వహించాల్సి వస్తోందని చెప్పారు. దీనిపై డీసీపీ కృష్ణమూర్తినాయుడు స్పందిస్తూ విజయవాడ పోలీసు కమిషనరేట్ పరిధిలోని ప్రాంతాన్ని కృష్ణాజిల్లా పోలీసులు చూడటం వల్ల సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ గ్రేటర్ విజయవాడతో అనేక ప్రధానమైన సమస్యలు తొలగుతాయన్నారు. ప్రజాప్రతినిధులందరూ గ్రేటర్‌కు అనుకూలంగా ఉన్నారు కాబట్టి.. కమిషనర్, కలెక్టర్లు కూడా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని కోరారు. అనంతరం ఎంపీ మీడియాతో మాట్లాడుతూ గ్రేటర్ విజయవాడపై త్వరలో సీఎంతో మాట్లాడతామని, ఎన్ని గ్రామాలను విలీనం చేయాలన్న దానిపై సానుకూలంగా నిర్ణయం తీసుకుంటామన్నారు.



చల్లపల్లిలో ఎన్‌హెచ్‌పై తడిచిన ధాన్యం

పంట రక్షించుకునేందుకు

చల్లపల్లి - పెదకళ్లేపల్లి రోడ్డులో ధాన్యం ఆరబెడుతున్న రైతులు, కూలీలు

నానా పాట్లు

ధాన్యం ఆరబెట్టుకుంటూ..పరదాలు కప్పుకొంటూ రైతుల అవస్థలు

గాలులకు నేలకొరిగిన వరిపైరు.. మందకొడిగా ధాన్యం కొనుగోళ్లు

చల్లపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాల కారణంగా రైతులు నానా పాట్లు పడుతున్నారు. శుక్రవారం సాయంత్రం వర్షం కురవటంతో ధాన్యపు రాశులపై పరదాలు కప్పిన రైతులు శనివారం ఉదయం వాటిని తొలగించి ఆరబెట్టుకున్నారు. కూలీల ఖర్చును భరించలేని రైతులు గ్రామాల్లో యంత్రాలతో కోయించి, ఎన్‌హెచ్-216 పైన, ఖాళీ ప్రదేశాల్లో ఆరబెట్టుకుంటున్నారు. తుఫాను వార్తలతో ధాన్యపు రాశులను వర్షానికి తడవకుండా పరదాలు, టార్పాలిన్లు కప్పి పంటను రక్షించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఆరిన ధాన్యాన్ని బస్తాలకు ఎత్తుకుని రోడ్డుపక్కనే ఉంచి టార్పాలిన్‌లు కప్పారు. తేమశాతం ఎక్కువగా ఉన్న ధాన్యం హైవేపై ఆరబెట్టుకున్న వారంతా ఉదయం పరదాలు తొలగించి ఆరబెట్టుకున్నారు. మళ్లీ వర్షం కురవడంతో హడావుడిగా అవస్థలు పడుతూ పరదాలు కప్పారు. నేలపై ఆరబోసుకున్న ధాన్యం, వర్షం కారణంగా కొంతభాగం తడిసిపోవటంతో ఆరబెట్టుకునేందుకు ఇబ్బంది పడ్డారు. కొందరు రైతులకు పరదాలు లేక ధాన్యాన్ని అలాగే వదిలేశారు. దీంతో ధాన్యం వర్షానికి తడిసిపోయింది. తుఫాను ప్రభావిత గాలులతో పలు గ్రామాల్లో వరిపైరు నేలకొరిగింది. అక్కడక్కడా కోతలు కోసిన రైతులు హడావుడిగా కుప్పలు వేసుకోగా, కొన్నిచోట్ల వరిపైరు పనలపైన ఉంది.



బొమ్ములూరులో హడావుడిగా బస్తాల్లో ధాన్యం నింపుతున్న కూలీలు



చల్లపల్లి మండలం లక్ష్మీపురంలో గాలులకు నేలకొరిగిన వరి

చలిగాలులు, చినుకులు

గుడివాడ రూరల్: మండలంలో శుక్రవారం ఉదయం నుంచి చలిగాలులు, చినుకులు పడటంతో రైతులు పొలం నుంచి ధాన్యాన్ని బయటకు తేవటానికి నానా పాట్లు పడుతున్నారు. బొమ్ములూరు, చిరుచింతల, లింగవరం గ్రామాల్లో రైతులు ధాన్యం రాశులను కాపాడుకోవటానికి అద్దెకు పరదాలు తెచ్చుకుని కప్పుతున్నారు. కొందరు కాటాలు వేయించి బస్తాలను ఇళ్లకు, గోడౌన్లకు, చావిళ్లకు తరలించుకుంటున్నారు. మరికొందరు రేటు సంగతి చూద్దాం ముందు ధాన్యం తోలుకోండి అని మిల్లు యజమానులను ప్రాధేయపడి మిల్లులకు తోలుతున్నారు. భారీ వర్షాలు కురిస్తే ధాన్యం చేతికి అందదేమోనని ఆందోళన చెందుతున్నారు. వారం నుంచి కష్టపడుతున్నా అధికారులు, నాయకులు వచ్చి వెళ్లటమే కానీ పరిష్కారం కనపించటం లేదని బొమ్ములూరు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మిల్లుల నుంచి కొనుగోళ్లకు అనుమతి లేకపోవటం వల్ల ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నెట్ సరిగా పనిచేయకపోవటం వల్ల రైతులకు సకాలంలో సేవలు అందడం లేదు.

గోడౌన్లు పరిశీలిస్తున్నాం: జేసీ గీతాంజలి శర్మ



భారీ వర్షాలు కురిస్తే ధాన్యం నిల్వ చేయడం కోసం తట్టివర్రులో ప్రైవేట్ గోడౌన్‌ను పరిశీలిస్తున్న జేసీ గీతాంజలిశర్మ

గుడివాడ రూరల్: తుపాన్ రాష్ట్రం వైపు వస్తున్నందున గోడౌన్లను పరిశీలిస్తున్నామని జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ తెలిపారు. శనివారం తట్టివర్రులో ఉన్న ప్రైవేట్ గోడౌన్‌ను జేసీ పరిశీలించారు. వర్షాలు భారీగా కురిస్తే ఒక పెద్ద గోడౌన్‌ను తమకు అప్పగించాలని యాజమాన్యంతో మాట్లాడారు. రైతులను ఆదుకోవటానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆర్డీవో సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ కోటేశ్వరరావు, ఏడీఏ ఎన్.రమాదేవి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

సంచులు, టార్పాలిన్ల కొరత

కూచిపూడి: కూచిపూడి, మొవ్వ, పెడసనగల్లు, చినముత్తేవి, భట్లపెనుమర్రు, కోసూరు, కాజ, నిడుమోలు గ్రామాల్లో రైతులు అకాల వర్షం కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలకు తోడు గాలులు వీస్తుండటంతో వరికోతకు సిద్ధమైన పొలాలు నేలకొరిగాయి. ఈ ఏడాది అధికంగా యంత్రాలతో నూర్పిళ్లు చేశారు. రైతుసేవా కేంద్రాలు, పీఏసీఎస్‌ల ద్వారా ధాన్యం కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. సంచుల కొరతతో నూర్పిన ధాన్యం ఎక్కడికక్కడే నిల్వ ఉండిపోయింది. ధాన్యాన్ని రక్షించుకునేందుకు టార్పాలిన్లు, పరదాల కొరత ఏర్పడింది. కాటా వేసిన ధాన్యం మిల్లులకు తరలించాలంటే లారీల కొరత ఉంది. మిల్లుల్లో ధాన్యం దించుకోవడం లేదని తిప్పి పంపిస్తున్నారని రైతులు చెబుతున్నారు. ధాన్యం తేమశాతం ఎక్కువగా ఉండటంతో ఆరబెట్టుకోవటం రైతులకు ప్రహసనంగా మారింది. అసలే తేమగా ఉన్న ధాన్యం వర్షాలకు తడిస్తే మొలకెత్తే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



మొవ్వలో ధాన్యం బస్తాలపై పరదాలు కప్పుతున్న రైతులు

ఆడపిల్లకు జన్మనిచ్చిన బాలిక

» తల్లితో సహజీవనం చేస్తున్న వ్యక్తి అఘాయిత్యం

» ఆలస్యంగా వెలుగులోకి వ్యవహారం.. నిందితుడిపై పోక్సో కేసు

అజిత్‌సింగ్‌నగర్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): తండ్రి స్థానంలో ఉన్న వ్యక్తి పదహారేళ్ల బాలికను గర్భవతిని చేశాడు. ఆ బాలిక రెండు వారాల క్రితం ఆడ శిశువుకు జన్మనివ్వడంతో విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అజిత్‌సింగ్ నగర్ లూనా సెంటర్ ప్రాంతానికి చెందిన బాలిక(16) సమీపంలోని ఓ పాఠశాలలో పదవ తరగతి చదువుతోంది. బాలిక చిన్న వయస్సులోనే తల్లిదండ్రుల మధ్య విభేదాలు రావడంతో వారిద్దరూ విడిపోయారు. అప్పటి నుంచి బాలిక తల్లి వద్దనే ఉండి చదువుకుంటోంది. బాలిక తల్లి పదేళ్లక్రితం అదే ప్రాంతానికి చెందిన అనంత శంకర్‌దాస్ అనే వ్యక్తితో సహజీవనం చేస్తోంది. బాలిక తల్లి హౌస్‌కీపింగ్ విధుల నిమిత్తం వేరే పట్టణాలకు వెళ్లి 15 రోజులపాటు అక్కడే ఉండేది. ఆ సమయంలో శంకర్‌దాస్ బాలికకు మాయమాటలు చెప్పి, బెదిరించి బాలికపై అఘాయిత్యానికి పాల్పడుతుండేవాడు. నాలుగు నెలల క్రితం బాలిక అనారోగ్యానికి గురికావడంతో విషయాన్ని తన తల్లికి చెప్పింది. దీంతో తల్లి వైద్య పరీక్షలు చేయించగా బాలిక గర్భవతి అని తేలింది. దీంతో అప్పటి నుంచి తల్లి బాలికను పాఠశాలకు మాన్పించి ఖమ్మంలోని బంధువుల ఇంటి వద్ద ఉంచింది. ఈనెల18న బాలిక ఆడ శిశువుకు జన్మనివ్వడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఆస్పత్రి నుంచి సమాచారం అందుకున్న అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు శంకర్‌దాస్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. శంకర్‌దాస్ పరారీలో ఉన్నాడు. శంకర్‌దాస్ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

నలుగురు మోటారు

దొంగల అరెస్టు

» 34 మోటార్లు, బైక్, కారు స్వాధీనం

నందివాడ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో చేపల చెరువులపై మోటార్ల చోరీకి పాల్పడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ సోమేశ్వరరావు తెలిపారు. వారి నుంచి రూ.3.16 లక్షల విలువ చేసే 34 మోటార్లు, ఓ కారు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. మోటార్లు పోతున్నాయని పలువురు రైతులు ఫిర్యాదు చేయగా, ఎస్ఐ కె.శ్రీనివాస్ తన సిబ్బందితో గస్తీ నియమించారు. నలుగురిని అదుపులోకి కేసు నమోదు చేసి గుడివాడ కోర్టుకు తరలించినట్లు తెలిపారు.



శ్రీమతి అమరావతి ఆడిషన్స్‌లో పాల్గొన్న మహిళలు

సొగసైన శ్రీమతులు

విజయవాడ సిటీలైఫ్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): తేజాస్ ఎలైట్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో శనివారం ఓ ప్రైవేటు హోటల్‌లో శ్రీమతి అమరావతి తొమ్మిదో సీజన్ ఆడిషన్స్ నిర్వహించారు. మొత్తం 50 మంది మహిళలు పేర్లను నమోదు చేసుకోగా 30 మంది ఆడిషన్స్‌లో పాల్గొన్నారు. వారిలో 26 మందిని పోటీలకు ఎంపిక చేశారు. ఈనెల 14వ తేదీన ఫైనల్ పోటీలు నిర్వహిస్తామని తేజాస్ ఎలైట్ ఈవెంట్స్ అధినేత ప్రదీప్‌చౌదరి వెల్లడించారు.

మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు

ఘన వీడ్కోలు

గన్నవరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు గన్నవరం విమానాశ్రయంలో ఘనవీడ్కోలు లభించింది. రెండు రోజుల క్రితం ఢిల్లీ నుంచి విజయవాడ వచ్చిన సంగతి తెలిసిందే. రెండు రోజుల కార్యక్రమాల అనంతరం శనివారం రోడ్డు మార్గాన ఆయన విమానాశ్రయానికి చేరుకున్నారు. అనంతరం కోవింద్ దంపతులు ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానంలో హైదరాబాద్ వెళ్లారు. పలువురు అధికారులు వీడ్కోలు పలికారు.

దుకాణాలు ఇప్పిస్తానని మోసం చేసిన

వైసీపీ నాయకుడిపై కేసు

అజిత్‌సింగ్‌నగర్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): తనకు ఎమ్మెల్యే, రాజకీయ నాయకులు తెలుసని నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద వ్యాపార దుకాణాలు ఇప్పిస్తానని ఓ మహిళను నమ్మించి రూ.25 లక్షలు వసూలు చేసిన వైసీపీ నాయకుడు, అతని భార్యపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. కేదారేశ్వరపేటకు చెందిన పల్లె శివపార్వతి ప్రభాస్ కాలేజీ వద్ద గల రైతుబజార్‌లో కూరగాయల వ్యాపారం చేస్తుంది. భర్త ముఠా పని చేస్తుంటాడు. మూడేళ్ల క్రితం వైసీపీ నాయకుడు మహేష్ అతని భార్య ఝాన్సీలు శివపార్వతికి పరిచమయ్యారు. తమకు ఎమ్మెల్యే, రాజకీయ నాయకులు తెలుసని ఆమెను నమ్మబలికారు. నగరంలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో వ్యాపార దుకాణాలు ఇప్పిస్తానని చెప్పి ఆమె వద్ద నుంచి రూ.25 లక్షలు, 14 కాసుల బంగారపు ఆభరణాలు విడతల వారీగా వసూలు చేశారు. అప్పటి నుంచి వ్యాపార దుకాణాల గురించి శివపార్వతి అడుగగా మహేష్, అతని భార్య అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తూ వస్తున్నారు. దీంతో విసిగిపోయిన మహిళ అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విషాదం

(5వ పేజీ తరువాయి)

స్థలాన్ని ఎమ్మెల్యే బోడె ప్రసాద్, ఎస్పీ ఆర్.గంగాధరరావు సందర్శించారు.

తనయుడు లేడని తెలిసి తనువు చాలించిన తల్లి

ముగ్గురు స్నేహితుల మృతితో బలరామునిపేటలో విషాదఛాయలు అలముకున్నాయి. కుటుంబ సభ్యులంతా హుటాహుటిన కంకిపాడు వెళ్లారు. కాగా, ఏసుబాబు మృతి వార్త విన్న తల్లి సుధారాణి (60) గుండెపోటుకు గురై మృతిచెందారు. తనయుడి మృతివార్త విని గుండెలు బాదుకున్న ఆమె ఒక్కసారిగా హార్ట్ ఎటాక్‌కు గురయ్యారు. ఆమెను మచిలీపట్నం దగ్గరలోని ఆసుపత్రికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండాపోయింది.

ఫెంగల్ కలవరం

(5వ పేజీ తరువాయి)

పెడన, గూడూరు, పామర్రు తదితర ప్రాంతాల్లో వరికోతలు కోయించారు. రెండో పంటగా మినుము విత్తనాలు చల్లారు. పనలపై ఉన్న వరితో పాటు మొలకెత్తి రెండు ఆకుల దశలో ఉన్న మినుము మొక్కలు కూడా వర్షానికి చనిపోయే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు. పొలంలో నీరు నిలబడితే అధిక తేమశాతం కారణంగా ఈ పరిస్థితి ఏర్పడుతుందంటున్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.4,500 కూలీలకు ఇచ్చి వరి కోతలు పూర్తిచేశామని, మరో రూ.4 వేలు ఖర్చుచేసి మినుము విత్తనాలు చల్లామని, మినుము మొక్కలు చనిపోతే మరింత నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మినుము మొక్కలు చనిపోతే పొలం మళ్లీ దమ్ముచేసి విత్తనాలు చల్లాల్సి ఉంటుందంటున్నారు. ప్రస్తుతం కురిసిన వర్షం కారణంగా 15 శాతం నష్టం వాటిల్లుతుందని, రెండు రోజుల పాటు వర్షం కురిస్తే నష్టం మరింత పెరుగుతుందని చెబుతున్నారు.

రోడ్లపైనే ధాన్యపు రాశులు

జిల్లాలోని పలు ప్రాంతాల్లో రహదారులు, డొంకరోడ్లు, పొలాల్లోని దిబ్బలపై ధాన్యాన్ని రాశులుగా పోసి ఉంచారు. శనివారం రాత్రి కూడా వర్షం కురుస్తూనే ఉండటంతో రాశుల అడుగు భాగంలోకి నీరు చేరింది. దీంతో రెండు అంగుళాల మందంలో ధాన్యం తడిచిపోతోందని, పరదాలు కప్పి ఉంచడం వల్ల మొలకలు వస్తాయని రైతులు చెబుతున్నారు. శనివారం వర్షం కురుస్తూనే ఉండటంతో ధాన్యాన్ని మిల్లులకు తరలించే అవకాశం లేకుండాపోయింది.

ఇసుక దుమారం

(5వ పేజీ తరువాయి)

సమీపంలో 16 రోజులుగా ఇసుకను అనధికారికంగా తరలించుకుపోతున్నారని, అధికారులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదని అవనిగడ్డ జెడ్పీటీసీ సభ్యుడు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు.

ధాన్యం కొనుగోలులో అలసత్వంపై నిలదీత

ధాన్యం కొనుగోలు, తేమశాతం పేరుతో మద్దతు ధరలో కోత పెడుతున్న తీరుపై ఉమ్మడి జిల్లాకు చెందిన సభ్యులంతా అధికారులను నిలదీశారు. బస్తా ధాన్యానికి మద్దతు ధరను రూ.1,725 ఇవ్వాల్సి ఉండగా, రూ.1,380 నుంచి రూ.1,400కే ఇస్తున్నారన్నారు. ధాన్యం ఎత్తేందుకు సంచులు ఇవ్వకుండా, రవాణాకు వాహనాలను సమకూర్చకుండా తీవ్ర జాప్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వమే ధాన్యం కొంటున్నట్లు పైకి చెబుతున్నా, దళారులు చెప్పినట్టుగానే రైతుసేవా కేంద్రాల సిబ్బంది, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు నడుచుకుంటున్నారని సభ్యులు పేర్కొన్నారు. తేమశాతం అధికంగా ఉందని ముసునూరు, గన్నవరం, గూడూరు తదితర మండలాల్లో బస్తాకు 10 కిలోలు అదనంగా ధాన్యం తీసుకుంటున్నారన్నారు. మోపిదేవి జెడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లికార్జునరావు మాట్లాడుతూ ప్రభుత్వం ధాన్యాన్ని సక్రమంగానే కొంటోందని, రైతులకు మద్దతు ధర కూడా ఇస్తోందని, యంత్రాల ద్వారా అధికశాతం వరి కోతలు పూర్తిచేయడంతో కొనుగోలులో కొంతమేర ఇబ్బంది ఏర్పడిందన్నారు. దీంతో సభ్యులంతా లేచి ఆయనతో వాగ్వాదానికి దిగారు. పరిస్థితి అదుపు తప్పుతుండటంతో మంత్రి కలుగజేసుకుని.. ప్రతి ధాన్యపు గింజను కొంటామని, వర్షాల వల్ల రైతులు కొంత మేర ఇబ్బందుల పాలవుతున్నారని, రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ గత ఏడాది నవంబరు నెలాఖరు నాటికి 35 వేల టన్నుల ధాన్యాన్ని కొనగా, ఈ ఏడాది ఇప్పటివరకు 95 వేల టన్నులు కొన్నామన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కార మార్గం

జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా జిల్లాను యూనిట్‌గా పరిగణించి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రణాళికను రూపొందించినట్లు ఎంపీ వల్లభనేని బాలశౌరి తెలిపారు. ఇటీవల డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, తాను కేంద్ర మంత్రులను కలిసి ఈ అంశంపై చర్చించినట్లు తెలిపారు. ఈ పథకం అమలు కోసం, నిధుల విడుదల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చలు జరుపుతామన్నారు. కృష్ణాడెల్టాలో పంటకాల్వలు, డ్రెయినేజీల్లో పూడికతీత పనులు చేసేందుకు వేసవిలో చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు.

మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేయాలి : యార్లగడ్డ

స్వాతంత్ర్య ఉద్యమంలో పాలుపంచుకున్న, జిల్లాను అభివృద్ధి చేసేందుకు పాటుపడిన మహనీయుల విగ్రహాలను మచిలీపట్నంలో ఏర్పాటు చేసేందుకు జెడ్పీ పాలకవర్గం ఆమోదం తెలపాలని ప్రభుత్వవిప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రతిపాదన చేశారు. పింగళి వెంకయ్య, పట్టాభి సీతారామయ్య, కాకాని వెంకటరత్నం, అయ్యదేవర కాళేశ్వరరావు తదితర మహనీయుల విగ్రహాలకు అయ్యే ఖర్చును తానే భరిస్తానని చెప్పారు. ఈ ప్రతిపాదనకు సభ్యులంతా ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈవో కన్నమనాయుడు, కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	107,115, 126
చికెన్ విత్ స్కిన్	204
చికెన్ స్కిన్‌లెస్	214

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 610

40 ఏళ్ల కల టీడీపీతోనే నెరవేరింది

కంకిపాడు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలం వారి వీధి అభివృద్ధి 40 ఏళ్ల కల అని అది టీడీపీతోనే సాధ్యమైందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సుదిమళ్ల రవీంద్ర అన్నారు. భద్రచలం వారి వీధి అభివృద్ధికి రూ. 15 లక్షలతో చేపడుతున్న పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ, భద్రాచలం వారి వీధి అభివృద్ధికి నోచుకోక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే రోడ్డుతో పాటు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ కృషి చేయడం జరిగిందని తెలియజేశారు. టీడీపీ నాయకులు పులి శ్రీనివాసరావు, గోగినేని వెంకటరమణ, చలవాది రాజా, ఏనుగ జయప్రకాష్, బొర్రా వెంకట్, వణుకూరు విక్రం, షేక్ బాజి, కొండా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రైతులను కలవరపెడుతున్న తుఫాను

గన్నవరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించి పండించిన పంట నోటి దగ్గరకు వచ్చే సమయంలో వాతావరణంలో మార్పులు రావటంతో పాటు వర్షపు జల్లులు పడటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మండలంలో సూరంపల్లి, రామచంద్రాపురం, ముస్తాబాద, పురుషోత్తపట్నం, సావరగూడెం, తెంపల్లి, వీరపనేనిగూడెం, మెట్లపల్లి, తదితర గ్రామాల్లో యంత్రాల ద్వారా వరికోతను కోసి పంటను ఒడ్డుకు చేర్చారు. ఆ పంటను కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడాల్సి వస్తుంది. వాయుగుండం ప్రభావంతో వర్షం జల్లులు పడుతు న్నాయి. పరదాలు కప్పి పంటను కాపాడుకుంటున్నారు. తేమ 17శాతం లోపు ఉంటేనే ధాన్యం కొంటున్నారని ఈ తుఫాన్ వల్ల మరింత ఇబ్బంది పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సూరంపల్లిలో ధాన్యం రాశిపై పట్టాలు కప్పుతున్న రైతు

ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరికోతలు కోయించి రైతులు ఇబ్బంది పడవద్దని తహసీల్దార్ విజ్ఞప్తి చేశారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తతో ఉండాలని సూచించారు.



కాటూరులో రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ సురేశ్‌కుమార్

రైతులు భయాందోళన చెందొద్దు

ఉయ్యూరు : ధాన్యం తరలింపులో రైతులు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని మండల తహసీల్దార్ ఎం. సురేశ్‌కుమార్ అన్నారు. తుఫాను ప్రభావంతో తేలికపాటి వర్షం కురుస్తున్న పరిస్థితుల్లో శనివారం కాటూరు తదితర గ్రామాల్లో పర్యటిం చి రైతు సహాయ కేంద్రాలను సందర్శించారు. రైతులతో మాట్లాడి ధాన్య తరలింపు సంబంధించి ఏమైన సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శనివారం వివిధ గ్రామాల నుంచి 200 టన్నుల ధాన్యం మిల్లులకు వెళ్లిందన్నారు. రాశులు, సంచుల్లో ధాన్యం ఉన్న రైతులకు 60 టార్పాలిన్లు అందచేశామన్నారు. ఇంకా అవసరమున్న వారికి అందజేస్తామన్నారు.

రైతులు టార్పాలిన్‌లను వినియోగించుకోవాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : వాతావరణలో మార్పులు చోటు చేసుకున్న నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం నుంచి బాపులపాడు మండల వ్యాప్తంగా చిరుజల్లులు మొదలవడంతో వరి పంట సాగుచేసిన రైతుల్లో ఆందోళన మొదలైంది. కాకులపాడు, దంటగుంట్ల తదితర గ్రామాలకు చెందిన పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఏవో భవాని వరిపంట కోతలను రెండు లేదా మూడు రోజుల పాటు వాయిదా వేసుకోవాలని సూచించారు. గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో టార్పాలిన్‌లు అందుబాటులో ఉంచామని, రైతులు వాటిని వినియోగించుకోవాలన్నారు.



కాకులపాడు పొలాల్లో రైతులకు సూచనలిస్తున్న ఏవో భవాని

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కంకిపాడు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ఒక రోజు ముందే పింఛన్లు పంపిణీ చేసిన ఘనత సీఎం చంద్ర బాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కే దక్కిందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. కంకిపాడులో శనివారం నిర్వహించిన పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోడె ప్రసాద్ మాట్లాడుతూ, పింఛన్ పంపిణీ వ్యవస్థను ప్రారంభించిన ఘనత టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు మాజీ సీఎం ఎన్టీఆర్‌కే దక్కిందన్నారు. 2014 నుంచి 19 మధ్య పింఛన్‌ను సీఎం చంద్రబాబు నాయుడు రూ. 2 వేలు పెంచటంతో పాటు 2024 అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రూ. 4 వేలకు పెంచిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, సర్పంచ్ బాకి రమణ, టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, మండల పార్టీ అధ్యక్షులు సుదిమళ్ల రవీంద్ర, ఉపసర్పంచ్ రాచూరి చిరంజీవి, పులి శ్రీనివాసరావు, కొండా నాగేశ్వరరావు, గోగినేని వెంకటరమణ, చలవాది రాజ, వణుకూరు విక్రం, ఏనుగ జయ, బొర్రా వెంకట్, కార్యదర్శి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కంకిపాడులో పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

సచివాలయం-1 పరిధిలో శనివారం పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా డీఎల్‌పీవో సంపత్‌కుమారి మాట్లాడుతూ, ఒక టవ తేదీ ఆదివారం కావటంతో ముందు రోజే ప్రభుత్వం లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను సద్వినియోగం చేసు కోవాలని సూచించారు. మండలంలో 11088 మంది పింఛనుదారులు ఉండగా 10708 మందికి అందజేసినట్లు ఎంపీడీవో టి.స్వర్ణలత తెలిపారు. పంచాయితీ కార్యదర్శి ప్రసాద్, వీఆర్వో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



కేసరపల్లిలో పింఛను పంపిణీ చేస్తున్న గుడివాడ డీఎల్‌పీవో సంపత్‌కుమారి



బాపులపాడులో పింఛన్ల పంపిణీలో టీడీపీ నేతలు

పింఛనుదారుల సంక్షేమానికి ప్రాధాన్యం

గన్నవరం : పింఛనుదారుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని గుడివాడ డీఎల్‌పీవో సంపత్‌కుమారి అన్నారు. మండలంలోని కేసరపల్లి

చిత్తశుద్ధితో పింఛన్లు పంపిణీ

హనుమాన్‌జంక్షన్ : పింఛను పొందే లబ్ధిదారులు పింఛను పంపిణీ చేసే సమయంలో గ్రామంలో లేకపోయినా మూడు నెలలు లోపు తీసుకునే సౌకర్యం రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని లబ్ధిదారులు గమనించి ఆందోళన చెందవద్దని టీడీపీ జంక్షన్ పట్టణ అధ్యక్షుడు అట్లూరి శ్రీనివాసరావు తెలిపారు. శనివారం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు పంపిణీ లో అట్లూరి శ్రీనివాసరావు పాల్గొని పంపిణీ చేశారు. బాపులపాడు మండలంలో 95 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో కె.జోగేశ్వరరావు తెలిపారు.

నేటినుంచి పునీత ఫ్రాన్సిస్ శౌరి మహోత్సవాలు

గన్నవరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అజ్జంపూడిలో పునీత ఫ్రాన్సిస్ శౌరి వారి మహోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభమవుతాయని ఎంఎఫ్ గురువులు తెలిపారు. తొలిరోజు ఉదయం 7 గంటలకు రెవరెండ్ ఫాదర్‌లు జాన్, సనాతన్, ఆంతోని, రాజీబ్‌లు దివ్య బలిపూజ నిర్వహించి మహోత్సవాలను ప్రారంభిస్తారని చెప్పారు. జపమాల, దివ్యకారుణ్య జపమాల, సాయంత్రం పతాక ఆవిష్కరణ, సమిష్టి దివ్య బలిపూజ ఉంటుందన్నారు. దానిలో నెల్లూరు మేత్రాసనం బిషప్ పిల్లి అంతోని దాస్ పాల్గొంటారని, ఈదర విచారణ నుంచి గాయక బృందం గీతాలను ఆలపిస్తారని రాత్రి సంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. 2వ తేదీ దివ్యబలిపూజ, రాత్రి ఏసోబు చరిత్ర బుర్ర కథ ఉంటుందన్నారు. మూడవ తేదీ విజయవాడ మేత్రాసన పీఠా ధిపతులు తెలగతోటి జోసఫ్ రాజారావు ముఖ్యులుగా వచ్చి ప్రసంగిస్తారని తెలిపారు. సాయంత్రం పునీతశౌరి వారి స్వరూపంతో ఊరేగిస్తారని తెలిపారు.

దివ్యాంగులకు ఆటల పోటీలు

హనుమాన్‌జంక్షన్, నవంబరు 30 (ఆంధ్ర జ్యోతి) : మానసిక, శారీరక దివ్యాంగుల్లో ఉల్లా సాన్ని నింపడం కోసమే ఆట లు పోటీలు నిర్వహించినట్లు మానవత రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు తెలిపారు. శనివారం మానవత హనుమాన్‌జంక్షన్ శాఖ ఆధ్వర్యంలో డిసెంబరు 3వ తేదీ ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని శనివారం స్థానిక ఏలూరు రోడ్డులోని అప్పనవీడు జడ్పీ హైస్కూల్‌లో ఆశాజ్యోతి, ఆదిత్య బధిర విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు.

ఉయ్యూరు కౌన్సిల్‌లో కుళాయి పన్ను పెంపునకు ఆమోదం

ఉయ్యూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు నగర పంచాయతీలో కుళాయి పన్ను పెంచేందుకు కౌన్సిల్‌లో ప్రతిపాదించారు. చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ అధ్యక్షతన శనివారం కౌన్సిల్ సాధారణ సమావేశంలో అజెండాలోని అంశాలు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా నగరపంచాయతీలో ఎంతో కాలంగా కుళాయి పన్ను నెలకు రూ. 50 వసూలు చేస్తున్నామని, విద్యుత్, ఇతర నిర్వహణ ఖర్చులు పెరిగిన నేపథ్యంలో రూ. 100లకు పెంచాల్సిన అవస రాన్ని చైర్మన్ సమా వేశంలో వెల్లడించి అందరి ఆమోదంతో కుళాయి పన్ను పెంచుదామన్నారు. గ్రామాల్లో సైతం కుళా యిపన్ను పెంచారని, నగరపంచాయతీ పరిధిలో ఆదాయం పెంచేందుకు పలు నిర్ణయాలు తీసుకోపోతే నగర పంచాయతీ అప్పుల ఊబిలో కూరుకుపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ మేరకు 2014లో నిర్ణయించిన లైసెన్స్ ఫీజుల మొత్తానికి ఒక్కొక్క దానిపై 10శాతం చొప్పున పెంచేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ సత్యనారాయణ

పోరంకి శ్రీకృష్ణవేణిలో ఏయూ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ సెంటర్

పెనమలూరు : ఆంధ్ర విశ్వ విద్యాలయం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ఎడ్యుకేషన్ ప్రాంతీయ కార్యాలయం పోరంకి శ్రీకృష్ణవేణి డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేశారని కళాశాల మేనేజిమెంటు తెలిపారు. డిగ్రీ, పీజీ, డిప్లొమా విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కళాశాల యాజమాన్యం కోరింది. వివరాలకు 9246837117, 9393935363, 08662581117 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

బాధిత కార్మికులకు న్యాయం చేయాలి

గన్నవరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం అయోధ్య అపార్టుమెంట్స్ బాధిత కార్మికులకు రావాల్సిన బకాయిలను చెల్లించాలని కోరుతూ చేపట్టిన రిలే దీక్షలు కొన సాగుతున్నాయి. శనివారం బాధిత కార్మికులకు భవన నిర్మాణ కార్మిక సంఘం(సీఐటీయూ) నాయకులు సంఘీభావం తెలిపారు. సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు ఎం.నాగబ్రహ్మాచారి మాట్లాడుతూ, కార్మికులను ఇబ్బందులకు గురిచేయటం సరికాదన్నారు. మేస్త్రులు రామ్మోహనరావు, సతీష్‌లు మాట్లాడుతూ 2018 నుంచి 2022 వరకు బిల్డర్ గుర్రం నాని ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులుగా తాపీ పనులు చేశామన్నారు. 14మంది మేస్త్రులు క్రింద ప్రతి రోజు 1200 మంది కార్మికులు పని చేశారని చెప్పారు. మేస్త్రులు బాబు, తులసీ, నాగూర్ బాషా, దాసు మోహన్, లక్ష్మీ ప్రసన్న, తేజ, వెంకన్న, బత్తుల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

గన్నవరం : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని ప్రిన్సి పాల్ కొమ్మినేని రామకృష్ణ అన్నారు. స్థానిక స్రవంతి హైస్కూల్‌లో భారత రాజ్యాంగం ఆమోద వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు రాజ్యాంగంపై క్విజ్ పోటీలు శనివారం నిర్వ హించారు. ప్రథమ స్థానం ఎం.ప్రణిత టీమ్, ద్వితీయ బి.తన్మయి టీమ్, తృతీయ వై.శ్రీదేవి టీములు నిలిచాయి.

జీవవైవిధ్య నాణేలు

అడవులు, జంతువులు, పక్షులు, భూమి, జలవనరులు... ఇవన్నీ జీవవైవిధ్యంలో భాగాలు. ఇందులో ఏ అంశం అదుపుతప్పినా పర్యావరణానికి పెను ప్రమాదం సంభవిస్తుంది. పర్యావరణంలో చొరబడిన కాలుష్యం కారణంగా ఎదురవుతున్న సవాళ్లను ప్రపంచంలోని అన్ని దేశాలు చూస్తున్నాయి. పరిశ్రమల నుంచి వెలువడుతున్న ఉద్గారాలు గాలిలో కాలుష్యాన్ని పెంచుతున్నాయి. అటవీ ప్రాంతం తగ్గిపోతుండడంతో జంతువులు, పక్షులు కనుమరుగవుతున్నాయి. భూమిపై పచ్చదనం తగ్గిపోవడంతో వాతావరణంలో వెచ్చదనం పెరుగుతోంది. జీవవైవిధ్యాన్ని పరిరక్షించడానికి ఐక్యరాజ్య సమితి కొన్ని లక్ష్యాలను నిర్దేశించుకుంది. ఇందులో సభ్యత్వం కలిగిన దేశాలు ఈ లక్ష్యానికి అనుగుణంగా సదస్సులు నిర్వహించాయి. కొన్ని ఒప్పందాలు చేసుకున్నాయి. ఈ సదస్సులు, ఒప్పందాల జ్ఞాపకార్థం ఆయా దేశాలు కొన్ని నాణేలను ప్రత్యేకంగా ముద్రించాయి. వాటిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీలైఫ్





గజరాజులకు ఏ నాణెం

జీవవైవిధ్యంలో జంతువులు ఓ భాగం. ఏనుగుల పరిరక్షణకు పలావు దేశం లవ్‌సింబల్‌లో ఉండే నాణేన్ని విడుదల చేసింది. పసిఫిక్ మహాసముద్రంలో మైక్రోనేషియా ప్రాంతంలో 500 ద్వీపాలతో ఈ దేశం ఉంటుంది. ఈ దేశానికి కోరోర్ అనే మరో పేరుంది. దీవుల్లో జరిగే వాణిజ్యానికి ఇది కేంద్ర బిందువు. ఈ దేశం 2013లో 5 డాలర్ల వెండి నాణేన్ని లక్కీ ఎలిఫెంట్స్ ఎవ్రీథింగ్ ఫర్ యూ నినాదంతో విడుదల చేసింది.

'స్టాక్‌హోం' కాయిన్



పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉండాలని 1972లో స్టాక్‌హోంలో ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో పర్యావరణ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని స్టాక్‌హోం సదస్సు గౌరవార్థం కొన్ని దేశాలు నాణేలను ముద్రించాలని నిర్ణయించుకున్నాయి. వెండి, నికెల్ తామ్రంతో ఈ నాణేలను విడుదల చేశారు.

'ఉద్గారం' నాణెం...

పారిశ్రామికీకరణ నేపథ్యంలో అన్ని దేశాల్లో కాలుష్య కారకాలు పెరిగిపోతున్నాయి. ఇవన్నీ పర్యావరణంపై తీవ్రమైన ప్రభావాన్ని చూపిస్తున్నాయి. ముఖ్యంగా పరిశ్రమల నుంచి వెలువడుతున్న కర్బన ఉద్గారాలను తగ్గించాలన్న నినాదంతో ఐక్యరాజ్య సమితి గ్రీన్‌బెల్టు పాలసీ రూపకల్పనకు 2009లో సదస్సును నిర్వహించారు. ఇందులో పాల్గొన్న దేశాలు వాటి జాతీయ ముద్రలతో పర్యావరణానికి సంబంధించిన గుర్తులను జోడించి వెండి, బంగారం నాణేలను ముద్రించాయి.



'ఎర్త్' కాయిన్

ప్రపంచ దేశాల్లోని ప్రజలకు పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధిపై అవగాహన పెంచడానికి ఐక్యరాజ్య సమితి లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఇందుకోసం 1992లో రియో డీ జెనీరోలో పర్యావరణ అభివృద్ధి సదస్సును నిర్వహించింది. ఈ సదస్సులో పాల్గొన్న దేశాలు ఈ సదస్సు జ్ఞాపకార్థం వెండి, నికెల్ తామ్రంతో రియో ఎర్త్ సమ్మిట్ నాణేలను విడుదల చేశాయి.



'వాతావరణ' ఒప్పంద నాణెం

అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య వాతావరణం. ఒకప్పుడు ఒక సైకిల్ ప్రకారం ఉండే వాతావరణంలో అనేక మార్పులు శరవేగంగా వచ్చాయి. ఎండలు తీవ్రంగా ఉన్న రోజుల్లో ఒక్కోసారి వాతావరణం చల్లబడి వర్షాలు కురుస్తాయి. ఏడాది మొత్తంలో ఎప్పుడు తుఫాన్లు వస్తాయో తెలియని పరిస్థితి. వాతావరణంలో పెరుగుతున్న కాలుష్యమే దీనికి కారణమని అభివృద్ధి చెందిన దేశాలు గుర్తించాయి. కలుషితమైన వాతావరణంలో మార్పులు తీసుకురావడానికి 2015లో పారిస్ నగరంలో క్లైమేట్ చేంజస్ పేరుతో ఒక సదస్సును నిర్వహించారు. కాలుష్యమయమవుతున్న వాతావరణాన్ని తిరిగి మార్చడానికి చేపట్టాల్సిన విధానాలపై అగ్రిమెంట్‌ను రూపొందించుకుని ఒప్పందాలు చేసుకున్నారు. ఈ సదస్సులో పాల్గొన్న దేశాలు పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞను సూచించే నాణేలను విడుదల చేశాయి.



భవనం ప్రారంభోత్సవంలో రవీంద్ర, కృష్ణప్రసాద్, నారాయణరావు, వేదవ్యాస్

చలసాని సారథ్యంలో విజయ డెయిరీ అభివృద్ధి

● చైర్మన్‌పై మాజీ ఎంపీ కనకమేడల ప్రశంసల జల్లు

పెడన, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): చలసాని ఆంజనేయులు సారథ్యంలో విజయ డెయిరీ ఎంతగానో అభివృద్ధి చెందిందని, అత్యధిక పాల సేకరణ ధర చెల్లించడమే కాక నూతన ఫ్యాక్టరీని కూడా ప్రారంభించడం గొప్ప విశేషమని రాజ్యసభ మాజీ సభ్యుడు కనకమేడల రవీంద్ర అన్నారు. పెడన మండలం పెనుమల్లి గ్రామంలో రవీంద్ర ఎంపీ నిధులతో నిర్మించిన నూతన పాల సేకరణ కేంద్ర భవనాన్ని శనివారం సాయంత్రం రవీంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమూల్ పోటీని తట్టుకుని కృష్ణామిల్క్ యూనియన్‌ను విజయపథంలో నడిపించిన ఆంజనేయులు నిజంగా అభినందనీయుడని ప్రశంసించారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ విజయ డెయిరీ పాడిరైతులకు అధిక ధర చెల్లించడమే కాక వారి కష్టసుఖాల్లో పాలు పంచుకోవడం గొప్ప విశేషమన్నారు. కల్యాణమస్తు పథకం కింద పాడి రైతుల ఇళ్లల్లో వివాహాలకు బంగారు నాణేలివ్వడం, క్షీరబంధు పథకం కింద చనిపోయిన పాడి రైతుల కుటుంబ సభ్యులకు రూ.50వేల ఆర్థిక సాయం అందిస్తూ కృష్ణా మిల్క్ యూనియన్ పాడి రైతులకు బాసటగా నిలుస్తోందని ప్రశంసించారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ విజయ డెయిరీ దినదినాభివృద్ధి చెందుతూ పాడి రైతులకు కొండంత అండగా నిలుస్తోందన్నారు. చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా చలసాని ఆంజనేయులు సారథ్యంలో కృష్ణామిల్క్ యూనియన్ భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్ మాట్లాడుతూ, పాడి రైతుల సంక్షేమాన్ని కాంక్షించి డెయిరీ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు కల్యాణమస్తు, క్షీరబంధు, ప్రతిభ వంటి వినూత్న పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని ప్రశంసించారు. కృష్ణా మిల్క్ యూనియన్ డైరెక్టర్లు అర్జా వెంకట నగేష్, చలసాని చక్రపాణి, ఎండి కొల్లి ఈశ్వరబాబు, పాడి రైతులు పాల్గొన్నారు.

ప్రతి నిర్మాణంలోనూ ప్రజల భాగస్వామ్యం

● రాజధాని అమరావతిలో తలపెట్టే ప్రతి పని ఇక ప్రజాభాగస్వామ్యంతోనే..!
● సీఆర్‌డీఏ ప్రాజెక్టు ఆఫీసు డిజైన్స్‌పై ప్రజాభిప్రాయ సేకరణ





విజయవాడ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణంలో తలపెట్టే ప్రతి పనికీ ప్రజలను భాగస్వామ్యం చేయాలన్న దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రాజధానిలో చేపట్టే ఏ పనైనా, ప్రాజెక్టు నిర్మాణాలైనా ప్రజల ఆకాంక్షలు, సూచనల మేరకు ఉండాలన్నది రాష్ట్ర ప్రభుత్వ అభిమతంగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సీఆర్‌డీఏ అధికారులు అమల్లోకి తీసుకు వచ్చారు. రాజధానిలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అమరావతి రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సీఆర్‌డీఏ) ప్రాజెక్టు ఆఫీసు బిల్డింగ్ డిజైన్స్ ఎలా ఉండాలన్న దానిపై సీఆర్‌డీఏ ప్రజాభిప్రాయ సేకరణ తలపెట్టింది. సీఆర్‌డీఏ ప్రాజెక్టు ఆఫీసుకు సంబంధించి రూపొందించిన మొత్తం 10 డిజైనన్‌ను సీఆర్‌డీఏ అధికారులు తమ వెబ్‌సైట్‌లో పెట్టారు. ఈ 10 డిజైన్లలో ఏది నచ్చిందో ఓటు వేసే పోల్ ఆప్షన్ ఇచ్చారు. వరుసగా పది నమూనాలుంటాయి. వీటిని జూమ్ చేసుకుని చూడొచ్చు. నచ్చిన డిజైన్‌ను ఎంచుకుంటే పేరు, విద్యార్హతలు, ఫోన్, రివ్యూ కోరుతూ ఒక పాపప్ వస్తుంది. అవి పూర్తి చేశాక సబ్‌మిట్ చేయాలి. శనివారం మధ్యాహ్నం అధికారికంగా వెబ్‌సైట్‌లో ఉంచారు. ప్రచారం చేపట్టకపోయినా సాయంత్రం 5 గంటల సమయానికి 438 మంది ఓటింగ్ వేశారు. ఆదివారం నుంచి సీఆర్‌డీఏ ప్రాజెక్టు ఆఫీసు డిజైన్లకు ఓటింగ్ శాతం భారీగా పెరిగే అవకాశం ఉంది. ఆంధ్రజ్యోతి పాఠకులూ సీఆర్‌డీఏ వెబ్‌సైట్‌కు వెళ్లి అందులోని మోడల్స్‌లో మీకు ఏది నచ్చిందో దానికి ఓటు వేయవచ్చు. ఈ పది డిజైన్లలో దేనికి మెజారిటీ ఓటింగ్ వస్తుందో ఆ డిజైన్‌నే సీఆర్‌డీఏ అధికారులు ఎంపిక చేస్తారు. మరింకెందుకింత ఆలస్యం..? వెంటనే సీఆర్‌డీఏ వెబ్‌సైట్‌కు వెళ్లి నచ్చిన డిజైన్‌ను ఎంపిక చేసుకోండి.



మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను కలిసిన బీబీఏ మాజీ అధ్యక్షుడు వి.గురునాథం, మాజీ కార్పొరేటర్ పిల్లి లక్ష్మీతులసీ

మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను కలిసిన నేతలు

మధురానగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి, జమిలి ఎన్నికల కమిటీ ఛైర్‌పర్సన్ రామ్‌నాథ్ కోవింద్‌ను బెజవాడ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, అఖిల భారత కోలి సమాజ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు వి.గురునాథం, విశ్రాంత సహాయ వాణిజ్య పన్నుల అధికారి, తొలి తెలుగు దివ్వె అధ్యయన సంఘం వ్యవస్థాపకులు పీవీఎల్‌రాజు, మాజీ కార్పొరేటర్ పిల్లి లక్ష్మీతులసీ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పీవీఎల్ ఎన్‌రాజు మాట్లాడుతూ తొలితెలుగు దివ్వె అధ్యయన సంఘం పరిశోధనల ముద్రితమైన పుస్తకాన్ని ఆయనకు అందించామన్నారు.



కృష్ణలంకలో పెన్షన్లు పంపిణీ చేస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

పెన్షన్లను సకాలంలో అందించండి

● వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

కృష్ణలంక, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పెన్షన్లను సకాలంలో ప్రజలకు అందించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. శనివారం కృష్ణలంకలోని 21వ డివిజన్‌లో ఆయన పర్యటించి పెన్షన్‌దారులకు పెన్షన్లు పంపిణీ చేశారు. ఆ ప్రాంతంలోని ప్రజలతో ఆయన స్వయంగా మాట్లాడారు. ప్రతి నెల పెన్షన్ వస్తుందా? ఎంత వస్తుంది? ఇతర సమస్యలు ఏమైనా ఉన్నాయా అని మాట్లాడి తెలుసుకొన్నారు. ప్రతి నెల సమయానికి పెన్షన్‌ను సిబ్బంది అందిస్తున్నారని ఎలాంటి సమస్యలు లేవని తెలుపగా కమిషనర్ సంతృప్తి చెందారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మధ్యాహ్నం 3 గంటల వరకు, సర్కిల్-1 పరిధిలో 20,744 పెన్షన్లకు 19326, సర్కిల్-2 పరిధిలో 25,906 పెన్షన్లకు 23,877, సర్కిల్-3 పరిధిలో 20,721 పెన్షన్లకు 19,089, మూడు సర్కిల్స్ పరిధిలో మొత్తం 67,371 పెన్షన్‌లకు 62,292 పెన్షన్లు పంపిణీ చేశారని అంటే దాదాపు 93 శాతం పెన్షన్ పంపిణీ చేశారన్నారు. ఈ పర్యటనలో పీవో (యూసీడీ) నారాయణ, జోనల్ కమిషనర్ ప్రభుదాస్, సీవో జగదీశ్వరి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

గన్నవరం టీడీపీ ఆఫీసుపై దాడి చేసిన 8 మంది నిందితులకు వైద్య పరీక్షలు

● కోర్టుకు హాజరుపరిచిన పోలీసులు



మచిలీపట్నం టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం టీడీపీ ఆఫీసుపై దాడిచేసిన 8 మంది నిందితులను శనివారం పోలీసులు ఇక్కడకు గట్టి బందోబస్తుతో తీసుకువచ్చారు. వైద్య పరీక్షలు నిర్వహించి వారిని తిరిగి గన్నవరం తీసుకుని వెళ్లి కోర్టుకు హాజరు పరిచారు. కాగా గన్నవరానికి చెందిన వైసీపీ సానుభూతి పరులను అరెస్టు చేసి తీసుకువెళుతున్న సమయంలో వారిని పరామర్శించేందుకు స్థానిక వైసీపీ కార్యకర్తలు తరలివచ్చారు.

అధికారపక్షమే విపక్షంగా..!

● డీఆర్‌సీలో సమస్యల ఏకరువు! ● రోడ్లు, గృహ నిర్మాణం, విద్య, వైద్యం, పారిశ్రామికం, పర్యాటక రంగాలపై చర్చ



ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్‌కు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలుకుతున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, వసంత కృష్ణ ప్రసాద్

ఆంధ్రజ్యోతి, విజయవాడ: రోడ్లు, గృహ నిర్మాణం, విద్య, వైద్యం, పర్యాటకం, పారిశ్రామికం, వ్యవసాయ రంగాలను అభివృద్ధి చేయటానికి అధికార పార్టీ ప్రజా ప్రతినిధులే విపక్షంగా వ్యవహరిస్తూ జిల్లా అధికారులకు కీలక సూచనలు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారిగా శనివారం రైతుశిక్షణ కేంద్రంలో జరిగిన డీఆర్‌సీ సమావేశంలో అధికార పార్టీ సభ్యులు విపక్షపాత్రను పోషించారు. సంక్షేమాభివృద్ధి రంగాల్లో నెలకొన్న అనేక సమస్యలను అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు ఏకరువు పెట్టారు. ప్రాథమిక, మౌలిక రంగాలను బలోపేతం చేయటానికి జిల్లా అధికారులకు కీలక సూచనలు చేశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా సత్యకుమార్ యాదవ్‌ను ప్రకటించిన నేపథ్యంలో ఆయన అధ్యక్షతన తొలి డీఆర్‌సీ సమావేశం జరిగింది. నూతన కలెక్టర్ లక్ష్మీశా సంధానకర్తగా వ్యవహరించారు. శాఖల వారీగా పురోగతిని వివరించేలా చెప్పించటం, ప్రజా ప్రతినిధులకు సందేహాలుంటే వారిచేత అడిగించటం చేయించారు. ప్రజా ప్రతినిధులు తమ దృష్టికి వచ్చిన అన్ని అంశాలను వారి చేత చెప్పించేందుకు శాఖల వారీగా వారి నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకునేలా ఎంతో పరిణితితో కలెక్టర్ సంధానకర్తగా వ్యవహరించటం ఆకట్టుకుంది. ముందుగా వ్యవసాయ రంగంపై స్థూలంగా చర్చ జరిగింది. జిల్లా వ్యవసాయశాఖ అధికారి మాట్లాడుతూ 2024- 25 రబీకు సంబంధించి రైతులకు రాయితీపై విత్తనాలు అందించేందుకు సంసిద్ధంగా ఉన్నామని, భూసార పరీక్షలకు 11,200 శాంపిల్స్ తీయటం జరిగిందన్నారు. గ్రామీణ నీటి సరఫరా విభాగానికి సంబంధించి చర్చ క్రమంలో గత ప్రభుత్వ హయాంలో పథకం అపహాస్యంగా మారిపోయిందని ప్రజా ప్రతినిధులు ఏకరువు పెట్టారు. జిల్లాలో 48 శాతం మాత్రమే పనులు జరిగాయని, కొత్తగా వాటర్ సోర్స్‌తో కలిపి డీపీఆర్ తయారు చేయించాలని సూచించారు. గృహనిర్మాణ రంగానికి సంబంధించి జక్కంపూడిలోని టిడ్కో గృహాలను పూర్తితో పాటు, మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి హడ్కో నుంచి రుణ ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు.

ప్రజా ప్రతినిధులు సంధించిన ప్రశ్నలు

ఎన్టీఆర్ హెల్త్ వర్శిటీ పేరును తిరిగి ఎన్టీఆర్ వర్శిటీగా పేరు మార్చిన క్రమంలో ఆవరణలో ఇంకా వైఎస్ఆర్ విగ్రహం ఉందని దాన్ని తొలగించాలని విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ప్రస్తావించారు. జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్య మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ కింద పులిచింతల నుంచి నీటిని సంగ్రహించే ముందు సరిహద్దు అంశాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ టెన్త్ పరీక్షలను ఆప్షన్ ఇస్తే తెలుగులో కూడా రాసే అవకాశం ఉన్నా సరైన ప్రచారం జరగటం లేదన్నారు. మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ కొండపల్లి ఖిల్లాకు వెళ్లే దారి అధ్వాన్నంగా ఉందని ప్రస్తావించారు. తిరువూరు ఎమ్మెల్యే శ్రీనివాసరావు మాట్లాడుతూ నెమలి వేణు గోపాలస్వామి ఆలయాభివృద్ధి చేయాలన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి: ఇన్‌చార్జి మంత్రి

జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధుల సమన్వయంతో సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. సమావేశాన్ని ఉద్దేశించి తర్వాత మీడియాతోనూ మాట్లాడారు. గత ఐదేళ్లలో ఒకే ఒక్క డీఆర్‌సీ సమావేశం జరిగిందని, ఇకమీదట తరచూ డీఆర్‌సీలు నిర్వహిస్తామన్నారు. ప్రతి మూడు నెలలకు క్రమం తప్పకుండా డీఆర్‌సీలు నిర్వహిస్తామన్నారు. మౌలిక సదుపాయాల కల్పన, గ్రామీణ నియోజకవర్గాల్లో రోడ్ల నిర్మాణాలు చేపట్టడం, తాగునీరు అంశాలపై దృష్టి నిలుపుతాయన్నారు.

ఏమిటీ సమన్వయ లోపం..?

కృష్ణా జిల్లాలో డీఆర్‌సీ సమావేశం జరిగింది. ఎన్టీఆర్ జిల్లాలో పక్షం కిందటే డీఆర్‌సీ తేదీ ఇచ్చారు. ఉమ్మడి కృష్ణా ప్రాంతాలతో కలిపి నిర్వహించాల్సిన జడ్పీ సమావేశాలను ఏకపక్షంగా నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లాలో డీఆర్‌సీ ఉన్న రోజునే జడ్పీ సమావేశం నిర్వహించటంతో జిల్లాకు చెందిన వారెవ్వరూ వెళ్లలేకపోయారు. అలాగే ఏలూరు జిల్లా నుంచి ఎవరూ వెళ్లలేదని తెలుస్తోంది. జడ్పీ అన్నది ఉమ్మడి జిల్లా వ్యవహారమైనా ఏకపక్ష నిర్వహణపై విమర్శలు వచ్చాయి.

3న అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

కృష్ణలంక, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుకలు డిసెంబరు 3న మొగల్రాజపురంలోని సిద్ధార్థ అకాడమీ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్టు విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాల వయోవృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా సహాయ సంచాలకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని, కావున జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులు, స్వచ్ఛంద సంస్థల ద్వారా నడుపబడుతున్న ప్రత్యేక పాఠశాలలో చదువుతున్న దివ్యాంగ పిల్లలు, జిల్లాలోని విభిన్న ప్రతిభావంతుల కోసం పనిచేస్తున్న సంఘాలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.


నేటి క్రికెట్ సెలక్షన్స్ మంగళగిరికి మార్పు

విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో డిసెంబరు 1న ఉదయం 8 గంటలకు జరగాల్సిన కేడీసీఏ అండర్-12 బాలుర సెలక్షన్స్ వేదికను వర్షం కారణంగా మంగళగిరి ఇండోర్ స్టేడియానికి మార్చినట్టు కేడీసీఏ సెక్రటరీ ఎం రవీంద్ర చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని అర్హతపత్రాలు, కిట్, డ్రెస్‌తో ఉదయం 8 గంటలకు హాజరు కావాలని ఆయన కోరారు.

నిబంధనల ప్రకారం పోటీల నిర్వహణ

భవానీపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఇటీవల రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలను పారదర్శకంగా నిర్వహించి, పలువురు క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు బీహార్‌కు పంపామని, ఇందులో అవాస్తవాలు వల్లించి క్రీడాకారులకు ద్రోహం చేయాలని చూస్తే సహించేది లేదని ఫెన్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వీ నాగేశ్వరరావు వెల్లడించారు. ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎఫ్ఏఐ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ అయిన క్రీడాకారులతో పోటీలు నిర్వహించామని, అండర్-20లో రాష్ట్రవ్యాప్తంగా 130 మంది నమోదు కాగా 50 మంది హాజరు కాగా, వారిలో మెడల్స్ సాధించిన వారిని ఎంపిక చేసినట్టు వివరించారు. రాష్ట్ర అసోసియేషన్‌లో నిధుల కొరత కారణంగా పోటీల నిర్వహణ ఆలస్యమైనా జట్టును జాతీయ పోటీలకు పంపి పారదర్శకతను నిరూపించామన్నారు. అశోక్ బాబు, సుబ్బారావు, క్రిస్టోఫర్, నాగం సతీష్ పాల్గొన్నారు.

భవానీదీక్షల విరమణకు ఏర్పాట్లు



భవానీ దీక్షల విరమణ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈవో రామారావు, పశ్చిమ ఏసీపీ, సీఐ

వన్‌టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో డిసెంబరు 21 నుంచి 25 వరకు జరగనున్న భవానీ దీక్షల విరమణల ఏర్పాట్లను శనివారం ఈవో కేఎస్ రామారావు, పశ్చిమ ఏసీపీ, వన్‌టౌన్ సీఐ, దుర్గగుడి ఈఈ పి.వైకుంఠరావు పరిశీలించారు. క్యూలు, హోమగుండాల ఏర్పాట్లు, అన్నవితరణ, ప్రసాదం కౌంటర్లు, తదితరాలను ఏఏ ప్రాంతాల్లో ఉన్నాయన్నదానిపై సమీక్షించారు. భక్తుల రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఉండేలా ఏర్పాట్లు చేయాలని అధికారులు సూచించారు. భక్తులు పెద్ద ఎత్తున దీక్షల విరమణలకు రానుండటంతో పకడ్బందీ ఏర్పాట్లు జరగాలని అధికారులు సూచించారు. డిప్యూటీ ఈఈలు, ఏఈఈలు, ముఖ్యఅర్చకుడు ఆర్. శ్రీనివాస శాస్త్రి పాల్గొన్నారు.

సహస్రలింగార్చన సేవ

దుర్గగుడిలో జరుగుతున్న కార్తీకమాస ఉత్సవాల్లో భాగంగా శనివారం మల్లేశ్వరస్వామి ఆలయంలో సహస్రలింగార్చన సేవ నిర్వహించారు. వేద పండితులు, అర్చకులు భక్తిప్రపత్తులతో శాస్త్రోక్తంగా వేదమంత్ర సహితంగా సహస్రలింగార్చన నిర్వహించారు. స్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, ప్రత్యేక అర్చనలు చేశారు. సహస్రలింగార్చన సేవలో ఈవో కేఎస్ రామారావు దంపతులు పాల్గొన్నారు. సహస్రలింగార్చన సేవలో స్వామిని పుష్పాలు, బిల్వాలతో నయనమనోహరంగా అలంకరించారు.

ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

● అధికారుల బెదిరింపులే కారణమంటూ సూసైడ్ నోట్

అవనిగడ్డ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అవనిగడ్డ ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పని చేస్తున్న మహేష్ అధికారులు వేధిస్తున్నారంటూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం ఆర్టీసీ డిపోలో కలకలం రేపింది. ఇటీవల కరకట్టపై రోడ్డు ప్రమాదానికి గురైన బస్సును మహేష్ బాబే డ్రైవ్ చేయగా, శనివారం అతడిని శిక్షణ నిమిత్తం మచిలీపట్నం డీపీటీవో వద్దకు పంపించారు. శిక్షణ సమయంలో డీపీటీవో వాణిశ్రీ మహేష్‌ను కించపరిచేలా దుర్భాషలాడటంతో అక్కడి నుంచి బయలుదేరి వస్తూ 3 పేజీల సూసైడ్ నోట్ రాసుకువచ్చి అవనిగడ్డ డిపో అసిస్టెంట్ మేనేజర్‌కు ఇచ్చి అక్కడే కుప్పకూలిపోయాడు. మార్గమధ్యలోనే మహేష్‌బాబు పురుగు మందు సేవించాడని గుర్తించిన ఆర్టీసీ సిబ్బంది వెంటనే అతడిని అవనిగడ్డ ఏరియా ఆసుపత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం మచిలీపట్నం పంపించారు.



ఆర్టీసీ డిపో వద్ద ధర్నా చేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

డిపో గేటు వద్ద ధర్నా చేసిన ఆర్టీసీ సిబ్బంది

మహేష్‌బాబు ఆత్మహత్యాయత్నంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఆర్టీసీ సిబ్బంది డిపో గేటు వద్ద ధర్నా నిర్వహించి కార్మికులపై వేధింపులు మానుకోవాలని డిమాండ్ చేశారు. నేతలు నాగిరెడ్డి, వెంకటేశ్వరరావు, ప్రసాద్, కుమార్, నారాయణ, సంజీవరావు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	107, 115, 126
చికెన్ విత్ స్కిన్	204
చికెన్ స్కిన్‌లెస్	214
నెక్ కోడిగుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.610	

షాదీఖానా నిర్మాణానికి శంకుస్థాపన

గుడ్లవల్లేరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తురాయిపాలెంలో రూ.20 లక్షల వ్యయంతో చేపట్టే షాదీఖానా నిర్మాణానికి శనివారం టీడీపీ గ్రామ అధ్యక్షుడు వీరమాచనేని శివ ప్రసాద్ శంకుస్థాపన చేశారు. గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు చెప్పి మండలంలోనే తొలి షాదీఖానాను డోకిపర్రులో ఏర్పాటు చేయించడంలో కృషి చేసిన వీరమాచనేని శివ ప్రసాద్‌ను ముస్లింలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఐటీడీపీ కార్యదర్శి షేక్ జానీ, మహబూబ్ బేగ్, షేక్ జిలానీ, ఎండీ బాజీ, ఎండీ బాజీ, కరీంబేగ్, మస్తాన్ బాబు,షేక్ దాదా, ఖాదర్ బేగ్, గౌసి పాల్గొన్నారు.



టీడీపీ సీనియర్ నేత అలీ మృతి



పమిడిముక్కల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : అలీనఖీపాలెం టీడీపీ సీనియర్ నాయకుడు, జిల్లా మైనారిటీ సెల్ మాజీ ఉపాధ్యక్షుడు మీర్జా మహ్మద్ అలీ (76) శనివారం ఉదయం మృతి చెందారు. పార్టీ ఆవిర్భావం నుంచి కార్యకర్త స్థాయి నుంచి అంచెలంచెలుగా జిల్లా మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడి స్థాయికి ఎదిగా పార్టీ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అలీ భౌతిక కాయంపై పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పలువురు టీడీపీ నా యకులు అలీ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.



కృతజ్ఞతా పూర్వక సమావేశంలో మెకానిక్‌ల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



ప్రజావేదికలో ఎమ్మెల్యే వెనిగండ్ల పుట్టినరోజు వేడుక డీపీని ఆవిష్కరిస్తున్న తులసిబాబు తదితరులు

మెకానిక్‌ల సమస్యలు పరిష్కరిస్తా

గుడివాడ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మెకానిక్‌ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ప్రజావేదికలో మెకానిక్ వర్కర్స్ యూనియన్ నాయకులతో శనివారం కృతజ్ఞతా సమావేశాన్ని నిర్వహించారు.

రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావుతో కలిసి ఎమ్మెల్యే వెనిగండ్ల మాట్లాడుతూ మెకానిక్‌ల సమస్యలను సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేష్‌ల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. టీడీపీ నాయకులు లింగం ప్రసాద్, జగన్మోహనరావు, యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నభిగోరి, జిల్లా అధ్యక్షుడు ఎండీ అక్బర్‌బాషా, కార్యదర్శి వెంకటేశ్వరరావు, యూనియన్ నాయకులు అంకాల సుబ్బారావు, నాగేశ్వరరావు, అన్సారీ, దినేష్, పి.మధు, డానియల్, శ్రీనివాసరావు, ఫణి, బంటుమిల్లి నాయకులు అహ్మద్ బాజీ, పెడన నాయకులు షేక్ జానీ, ముదినేపల్లి నాయకులు నాగరాజు, కలిదిండి నాయకులు ప్రసాద్, గుడ్లవల్లేరు నాయకులు రవి, గన్నవరం నాయకులు రవి కుమార్, పామర్రు నాయకులు రామాంజనేయులు, ఉయ్యూరు నాయకులు జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాము పుట్టిన రోజు డీపీ ఆవిష్కరణ

గుడివాడ : ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పుట్టిన రోజు సందర్భంగా ఇమేజ్ డిజిటల్స్ అధినేత కందుల రవి రూపొందించిన సామాజిక మాధ్యమాల కామన్ డీపీని శనివారం స్థానిక ప్రజావేదికలో టీడీపీ నాయకులు కామేపల్లి తులసీబాబు ఆవిష్కరించారు. సామాజిక మాధ్యమాల్లో అభిమానులు స్టేటస్‌గా పెట్టుకునేందుకు, ప్రత్యేకంగా కామన్ డీపీని రూపొందించినట్లు డీపీ రూపకర్త కందుల రవి అన్నారు. టీడీపీ నాయకులు జగన్మోహనరావు, కంచర్ల సుధాకర్, కడియాల గణేష్, పంచకర్ల మహేష్, రెడ్డి షణ్ముక్, అట్లూరి వెంకటేశ్వరరావు, అల్లాడ శ్రీనివాస్, జనసేన నాయకులు పులపా మహేష్, పాల్గొన్నారు.

సోమేశ్వరస్వామి ఆలయంలో అన్నసమారాధన

నందివాడ : పోలుకొండ సోమేశ్వరస్వామి దేవాలయంలో చలమచర్ల మురళీ కృష్ణమాచార్యులు (మురళీ) ఆధ్వర్యంలో శివలింగానికి అభిషేకాలు, హోమ పూజలు చేశారు. కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు.





సంక్షేమం- అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం

పమిడిముక్కల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి సంక్షేమం ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. పమిడిముక్కలలో లబ్ధిదారులకు సామాజిక పింఛన్లు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమలు చేస్తూ సామాజిక పింఛన్ రూ. 4 వేలకు పెంచి కూటమి ప్రభుత్వం మాట నిలబెట్టుకుందన్నారు. **పామర్రు** : మండల పరిధిలోని కనుమూరు గ్రామంలో శనివారం లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లను ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు దగ్గుబాటి ఫణీంద్ర, చాట్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తుఫాను ప్రభావంతో జోరు వర్షం



తోట్లవల్లూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : తుఫాను ప్రభావంతో శనివారం సాయంత్రం తోట్లవల్లూరు మండలంలో జోరు వర్షం కురిసింది. ఈ వర్షానికి అనేకచోట్ల ధాన్యం తడిసిపోయింది. యంత్రాలతో కోసిన ధాన్యాన్ని ఆరబెట్టగా వర్షంతో రైతులు గుట్టలుగా చేసి పరదాలు కప్పారు. అయినా ధాన్యం తడిసిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కోత కోసిన వరిపనలు తడిసిపోయాయి. వల్లూరుపాలెంలో 1262 రకం ధాన్యాన్ని దగ్గరుండి లారీల్లోకి లోడుచేయించి మిల్లులకు పంపించామని తహసీల్దార్ ఎం కుసుమకుమారి తెలిపారు. ఇంకా చాలా ధాన్యం రాశులు వర్షానికి తడిసిపోయాయి.

ఆందోళనలో రైతులు

పామర్రు: కోతలు, నూర్పిళ్లు పనులు పూర్తి చేసుకుని బస్తాల్లో ధాన్యం నింపి వాహనాలు అందక రోడ్లపై ధాన్యం బస్తాలను నిల్వ చేసిన రైతులకు వర్షంతో గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. శుక్రవారం సాయంత్రం నుంచి జల్లులుగా కురుస్తున్న వర్షం శనివారం మరింత పెరిగింది. దాంతో అందుబాటులో ఉన్న టార్పాలిన్లను కప్పి బిక్క ముఖంతో రైతులు చతికిల పడ్డారు. తహసీల్దార్ రవికాంత్ మాట్లాడుతూ, లారీలతో పాటుగా ఖాళీ సంచులను పొరుగు జిల్లాల నుంచి తెప్పించడం జరుగుతుందని, రైతులు ఎంత మాత్రం ఆందోళన చెందనవసరం లేదన్నారు.



అయ్యప్ప దేవస్థానంలో అన్నదానం

గుడివాడ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పదని, 50 రోజుల పాటు మాలధారులకు సద్దిని ఏర్పాటు చేయడం అభినందనీయమని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు అన్నారు. టెలిఫోన్ నగర్‌లోని శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవస్థానంలో అన్నదాన కార్యక్రమాన్ని రావి ప్రారంభించారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గోకవరపు సునీల్, జిల్లా కళింగ సాధికార కమిటీ అధ్యక్షుడు సింగవరపు ప్రభాకరరావు, టీడీపీ నాయకులు ముళ్ళపూడి రమేష్, గురుస్వాములు శ్రీరాములు, కిషోర్, తుమ్మలపల్లి గురుస్వామి శంకర్, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

లంక రైతులకు రహదారి నిర్మాణం

తోట్లవల్లూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరు కృష్ణా నదిపాయలో లంక రైతుల కోసం రహదారి నిర్మాణ పనులను శనివారం ప్రారంభించారు. గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి పలువురు టీడీపీ నాయకులు కొబ్బరికాయ కొట్టారు. ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా చొరవతో మైనేని చంటి ఎక్సకవేటర్‌ను ఇచ్చారని, కేసీపీ, రైతుల భాగస్వామ్యంతో రహదారి నిర్మిస్తున్నారని గురుమూర్తి తెలిపారు.



నేడు, రేపు టేబుల్ టెన్నిస్ పోటీలు

గుడ్లవల్లేరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూకే అంతర కళాశాలల టేబుల్ టెన్నిస్ పురుషుల, మహిళల పోటీలు డిసెంబరు 1, 2 తేదీల్లో గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల వేదికగా నిర్వహి చనున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణకుమార్ తెలిపారు. యూనివర్శిటీ టీమ్ ఎంపిక కూడా నిర్వహిస్తారన్నారు .జె.ఎన్.టి.యు అనుబంధ కళాశాలల నుంచి 100 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొననున్నారని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఇసుక కార్మికులకు కైలే క్షమాపణలు చెప్పాలి

తోట్లవల్లూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఇసుక తవ్వకాలపై మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ చేసిన ఆరోపణలు దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉన్నాయని దళిత నాయకుడు మట్టా అమృతబాబు, ఇసుక కార్మికులు అన్నారు. చాగంటిపాడు దళితవాడ వద్ద శనివారం ఇసుక కార్మికులతో కలిసి అమృతబాబు, టీడీపీ మండల ఎస్సీసెల్ మాజీ అధ్యక్షుడు దేవరపల్లి నాగరాజు మాట్లాడుతూ కైలే అనిల్‌కుమార్ తన తమ్ముడితో ఇసుక దందా నిర్వహించిన విషయం ప్రజలందరికీ తెలుసనన్నారు. కార్మికులు పచ్చగా బతుకుతుంటే ఓర్వలేక ఆరోపణలు చేసినందుకు అనిల్‌కుమార్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	107, 115, 126
చికెన్ విత్ స్కిన్	204
చికెన్ స్కిన్‌లెస్	214

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.610



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో మంత్రి రవీంద్ర

మోపిదేవి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవిలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని మంత్రి రవీంద్ర శనివారం ఉదయం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చక బృందం పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. నాగ పుట్టలో పాలుపోసి స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. వేదాశీర్వచనం పలికి శేషవస్త్రాలతో సత్కరించారు. ఈవో దాసరి శ్రీరామవర ప్రసాదరావు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు మంత్రికి అందజేశారు. మండల పార్టీ అధ్యక్షుడు నడకుదుటి జనార్దనరావు, రావి నాగేశ్వరరావు, రావి రత్నగిరి ఆయన వెంట ఉన్నారు.



వేదవ్యాస్‌ను సన్మానిస్తున్న కాపు సంక్షేమ నిర్మాణ సేన నాయకులు

రంగా ఆశయ సాధనకు కృషి చేయాలి

● వనసమారాధనలో వేదవ్యాస్

పెడన, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : వంగవీటి మోహనరంగా ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ పిలుపునిచ్చారు. పెడన నియోజకవర్గ కాపు సంక్షేమ నిర్మాణ సేన ఆధ్వర్యంలో బల్లిపర్రులో శనివారం కార్తీక వనసమారాధన జరిగింది. వేదవ్యాస్ మాట్లాడుతూ, కాపు సామాజిక వర్గంలో ఆర్థికంగా వెనుకబడిన వారిని ఆదుకోవడానికి ఒక ట్రస్టును ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. వేదవ్యాస్‌ను కాపు సంక్షేమ నిర్మాణ సేన నాయకులు సన్మానించారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, బొలిశెట్టి సత్యనారాయణ, బూరగడ్డ కిషన్‌తేజ, వంగవీటి శంతన్ కుమార్, సోడిశెట్టి బాలాజీ, సమ్మెట బాబు, ఇల్లూరి సుగుణబాబు, బత్తిన హరిరామ్, జక్కా ధర్మారాయుడు, మోటేపల్లి రత్నారావు పాల్గొన్నారు.





వైభవంగా చౌడేశ్వరీ అమ్మవారి సంబరం

చల్లపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లిలో శ్రీరామలింగచౌడేశ్వరి అమ్మవారి సంబరం అంగరంగ వైభవంగా జరిగింది. శుక్రవారం రాత్రి అమ్మవారిని ప్రత్యేక వాహనంపై ఊరేగించారు. అర్చకులు బళ్ల విశ్వనాథం, బి.వెంకటేశ్వరరావు నేతృత్వంలో బళ్లా రాజశేఖర్ దంపతులు వాహన పూజ నిర్వహించారు. కుంకుమ పూజలు జరిగాయి. కార్తీక సమారాధన జరిగింది. అమ్మవారి ఊరేగింపు ఉత్సవంలో నారసాల ప్రదర్శన ఆకట్టుకుంది. దేవాంగుల కుటుంబీకుల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఇంటి ఆడపడుచులు, ఇతర ప్రాంతాల్లో నివాసముంటున్న కుటుంబ సభ్యులు గ్రామానికి చేరుకుని చౌడేశ్వరి అమ్మవారి సంబరంలో పాల్గొన్నారు.



స్కౌట్స్ శిక్షణకేంద్రంలో మాట్లాడుతున్న సీనియర్ న్యాయాధికారి కె.వి. రామకృష్ణయ్య

ఉత్తమ పౌరుల రూపకల్పనకు స్కౌట్ దోహదం

మచిలీపట్నం టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు స్కౌటింగ్ దోహదపడుతుందని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.వి. రామకృష్ణయ్య అన్నారు. జిల్లా పరిషత్ సెంటర్‌లోని స్కౌట్స్, గైడ్స్ శిక్షణా కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న గైడ్స్ టీచర్ల శిక్షణ ఆరో రోజుకు చేరుకుంది. రామకృష్ణయ్య అతిథిగా పాల్గొన్నారు. ఎల్ఐసీ మేనేజర్ జ్యోతి, న్యాయవాది అజ్మతున్నీసా, రిటైర్డు డీవైఈవో విజయలక్ష్మి, రజియాబేగం, సిహెచ్. సుభాషిణి, భాస్కర్, సుబ్రహ్మణ్యం, ఓలేటి ఉమాసరస్వతి పాల్గొన్నారు.

సాధు మురళికి ఎంపీ బాలశౌరి నివాళి



మచిలీపట్నం టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఇమిటేషన్ జ్యూయలరీ అసోసియేషన్ నాయకులు సాధు మురళి చిత్రపటానికి ఎంపీ బాలశౌరి, జనసేన నాయకుడు బండి రామకృష్ణ శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. మురళి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పాత ఎడ్లంక వాసులకు శాశ్వత రహదారి సౌకర్యం కల్పించేందుకు సహకరించండి

అవనిగడ్డ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పాత ఎడ్లంక వాసులకు శాశ్వత రహదారి సౌకర్యం కల్పించేందుకు సహకరించాలని నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావును ఎన్ఆర్ఐ బొబ్బా గోవర్ధన్, టీడీపీ నాయకులు కొల్లూరి వెంకటేశ్వరరావు కోరారు. పాత ఎడ్లంక గ్రామస్థులు ఇబ్బందులను బొబ్బా గోవర్ధన్, కొల్లూరి వెంకటేశ్వరరావు శనివారం కనపర్తికి వివరించారు. గోవర్ధన్ ఆర్థిక సహకారంతో నిర్మిస్తున్న తాత్కాలిక కాజ్‌వేను కనపర్తి పరిశీలించి ఆయనను అభినందించారు. టీడీపీ ఎస్సీ సెల్ నేత మేడికొండ విజయ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



హైస్కూల్ స్థల సేకరణకు రూ.40 వేల విరాళం

కోడూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రామకృష్ణాపురం హైస్కూల్ నిర్మాణానికి స్థల సేకరణకు గ్రామస్థులు రూ.40 వేలు విరాళం అందజేసినట్లు ప్రధానోపాధ్యాయులు పెరవలి రాంబాబు తెలిపారు. పాఠశాల యాజమాన్య కమిటీ ఆధ్వర్యంలో మన బడి - మన బాధ్యత కార్యక్రమంలో భాగంగా ఇరాలి తరపున గ్రామ పెద్దలు రూ.40 వేలు విరాళం అందించారన్నారు. మాజీ సర్పంచ్ అద్దంకి పాండురంగారావు, దేవనబోయిన వెంకటేశ్వరరావు, గంజాల సుందరరావు, ఉపాధ్యాయులు అమరచంద్ తదితరులు పాల్గొన్నారు.



బల్లిపర్రు ధాన్యం కొనుగోలు కేంద్రంలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న జేసీ గీతాంజలి శర్మ



రైతుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఆర్డీవో స్వాతి, టీడీపీ నేతలు కనపర్తి, బొబ్బా గోవర్ధన్



లంకపల్లిలో ధాన్యాన్ని పరిశీలించి రైతుల సమస్యలు తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

కోతలు, నూర్పిళ్లు వాయిదా వేసుకోండి

● క్షేత్రస్థాయిలో జేసీ గీతాంజలి శర్మ, ఆర్డీవో స్వాతి పర్యటన ● రైతులకు సూచనలు

పెడన, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రైతులు వర్షాలు తగ్గే వరకు వరి కోతలు, నూర్పిళ్ల వాయిదా వేయాలని జేసీ గీతాంజలి శర్మ రైతులకు సూచించారు. పెడన, బల్లిపర్రు, నందమూరు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె శనివారం పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లోని సిబ్బంది నుంచి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. రైతులు విక్రయించిన ధాన్యం బస్తాలను పెడనకు కాకుండా మచిలీపట్నం, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాలకు తరలించడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. సమీపంలో ఉన్న పెడన మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. తేమశాతం ఎలా లెక్కిస్తున్నారని ఆమె ప్రశ్నించారు. మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు మూడు వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తహసీల్దార్ అనిల్‌కుమార్ జేసీ దృష్టికి తీసుకువచ్చారు. గోనె సంచులు అందుబాటులో ఉన్నాయన్నారు. వ్యవసాయ శాఖ ఏడీ నూరున్నీసా సమాచారం చెప్పడంలో తడబాటుకు గురవడంతో జేసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. డీసీఎంఎస్ ఫీల్డ్ ఇన్‌చార్జి నవీన్, వీఆర్వోలు పాల్గొన్నారు.

రైతులకు టీడీపీ నేతల భరోసా

మోపిదేవి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : వర్షం కారణంగా ధాన్యం తడిసిన రైతులు ఎలాంటి ఆందోళన చెందనవసరం లేదని, ప్రభుత్వం అండగా నిలుస్తుందని టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, ఎన్ఆర్ఐ బొబ్బా గోవర్ధన్ అన్నారు. మండలంలోని వెంకటాపురం, రావివారిపాలెం, పెదప్రోలు, శివరామపురం గ్రామాల్లో వర్షాల కారణంగా తడిసిన, రహదారుల వెంబడి ఆరబోసి ఉన్న ధాన్యాన్ని స్థానిక పార్టీ నాయకులతో కలిసి వారు పరిశీలించారు.

రైతుల ఇబ్బందును ఆర్డీవో స్వాతి దృష్టికి నేతలు తీసుకెళ్లగా, స్పందించిన ఆమె పెదప్రోలు శివారు కాసానగర్, కప్తానుపాలెం వద్ద ధాన్యాన్ని పరిశీలించారు. దళారులు, రైసు మిల్లుల యజమానుల మాటలు నమ్మవద్దని, వీఆర్వో, తహసీల్దార్ కార్యాలయాల్లో రైతులు తమ సమస్యలు చెప్పాలన్నారు. రైతులకు టార్పాలిన్లు ఏర్పాటు చేయాలని తహసీల్దార్, వ్యవసాయ శాఖాధికారులకు ఆర్డీవో సూచించారు. తేమ శాతం నిబంధనలతో అడ్డంకి లేకుండా వెంటనే ధాన్యం కొనుగోలు చేసేలా చూడాలని నేతలు ఆర్డీవో దృష్టికి తీసుకొచ్చారు. ఆయా గ్రామాలరైతులకు 50 టార్పాలిన్లు శనివారం పంపిణీ చేశారు. మోపిదేవి, కాసానగర్ గ్రామాల్లోని రైతులకు టార్పాలిన్లు తహసీల్దార్ ఎం.శ్రీవిద్య, ఏవో హెబ్సిబా రాణి అందజేశారు. మండల టీడీపీ అధ్యక్షులు నడకుదుటి జనార్ధనరావు, పార్టీ నాయకులు చందన రంగారావు, రావి నాగేశ్వరరావు, రావి రత్నగిరి, బళ్లా సీతారామప్రసాద్ తదితరులు ఉన్నారు.

గిట్టుబాటు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలి

ఘంటసాల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : వర్షం కారణంగా తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు డిమాండ్ చేశారు. లంకపల్లిలో రోడ్డుపక్కన ధాన్యాన్ని శనివారం ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. రమేష్‌బాబు మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల వల్ల ప్రతి ఏటా రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు తీవ్ర అన్యాయం చేస్తోందని విమర్శించారు. రైతు భరోసా ఇవ్వడం లేదన్నారు. తేమ శాతం సాకు చూపుతూ ధాన్యానికి గిట్టుబాటు ధర రూ.1725లు ఉంటే కేవలం రూ.1420 మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. వైసీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

తీర ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నాగాయలంక, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుపాను కారణంగా తీర ప్రాంతంలో బలమైన గాలులు వీస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎం.హరనాథ్ సూచించారు. ఏటిమొగలోని పడవ ప్రయాణం ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. సాధారణ పరిస్థితులు ఏర్పడే వరకు ఏటిమొగ - ఎదురుమొండి దీవుల గ్రామాల ప్రజలు అత్యవసర సందర్భాల్లో మాత్రమే పడవ ప్రయాణం చేయాలన్నారు. పడవలలో ఓవర్ లోడ్ లేకుండా చూడాలన్నారు. ఎంపీడీవో జె.సీతారామ కుమార్, ఎస్సై కె.రాజేష్ సిబ్బంది పాల్గొన్నారు.



మోపిదేవిలో లబ్ధిదారులకు పింఛన్ నగదు అందిస్తున్న మంత్రి రవీంద్ర



కానూరు గ్రామంలో వృద్ధులకు పింఛను నగదు అందజేస్తున్న గోపు సత్యనారాయణ

పింఛన్ల పంపిణీలో దేశానికే ఆదర్శం

మోపిదేవి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : సామాజిక పింఛన్లలో భారతదేశంలోనే రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తుందని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. డిసెంబరు 1వ తేదీ ఆదివారం సెలవు దినం కావటంతో నవంబరు 30వ తేదీ ఒక్కరోజు ముందుగానే మోపిదేవిలో సామాజిక భద్రతా పింఛన్లను మంత్రి రవీంద్ర పంపిణీ మండల టీడీపీ అధ్యక్షులు నడకుదుటి జనార్ధనరావు, పార్టీ సీనియర్ నాయకులు రావి నాగేశ్వరరావు, రావి రత్నగిరి, కోసూరు శివాజీ తదితరులు ఉన్నారు. **మచిలీపట్నం టౌన్** : ఒక రోజు ముందుగానే సామాజిక పింఛన్లు ఇచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదే అని జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ అన్నారు. శనివారం బందరు మండలంలో వివిధ గ్రామాల్లో తెల్లవారు జాము నుంచే కూటమి నాయకులు పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. కానూరులో వృద్ధులు, దివ్యాంగులకు గోపు సత్యనారాయణ పింఛన్లు పంపిణీ చేశారు. దివి మహేష్, బొమ్మిడి ఏడుకొండలు, పీత రాము, మోపిదేవి కృష్ణ, గోపు వెంకటరమణ, వంకా కాశీ, బోట్ల సాయి, బొమ్మిడి సాయి, చెక్కా నాగేశ్వరరావు, గుళ్ళపల్లి శరత్ పాల్గొన్నారు. చిన్నాపురం గ్రామంలో మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, సర్పంచ్ కాగిత గోపాలరావు పింఛన్లు పంపిణీ చేశారు. **గూడూరు** : గూడూరులో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను మండల టీడీపీ అధ్యక్షుడు పోతన స్వామి పంపిణీ చేశారు. తెలుగు యువత కార్యదర్శి ఎస్ఏ బేగ్, వార్డు సభ్యులు అమరారపు వెంకట సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి టి. భాస్కరరావు, ఏఎన్ఎం హేమలత పాల్గొన్నారు. **నాగాయలంక** : ముందుగానే ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేయించిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని టీడీపీ నేత, ఆంధ్రప్రదేశ్ మత్స్యకారుల సేవా సమితి ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు అన్నారు. శనివారం ఉదయం 6 గంటలకే ఉద్యోగి జగదీష్‌తో కలసి నాగాయలంకలో పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. వర్షం సైతం లెక్క చేయకుండా పింఛన్ల పంపిణీ చేస్తున్న అధికారులను అభినందించారు. **ఘంటసాల** : మండలంలోని 13 సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శులు, సచివా లయ ఉద్యోగులు, పంచాయతీ సిబ్బంది ఇంటింటికి వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. ఎంపీడీవో సుబ్బారావు మాట్లాడుతూ మాట్లాడుతూ సాయంత్రం 5 గంటలకు 94.15 శాతం పింఛన్ల పంపిణీ జరిగిందన్నారు. మండల వ్యాప్తంగా 7060 మంది లబ్ధిదారులు ఉండగా, 6645 మందికి పింఛన్లను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు.

పుల్లపాడులో ఎమ్మెల్యే కాగిత..

పెడన రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఒకటో తేదీ ఆదివారం కావటంతో శనివారమే పింఛన్ల పంపిణీ చేశామని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నా రు. పుల్లపాడులో జడ్పీటీసీ సభ్యుడు అర్జా నగేష్, మండల టీడీపీ అధ్యక్షుడు శలపాటి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి శీరం ప్రసాద్, సచివాలయ సిబ్బంది, గ్రామ పార్టీ నాయకులతో కలసి ఇంటింటికి పింఛన్లు అందించారు. మండలంలో శనివారం 95 శాతం పింఛన్ల పంపిణీ చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో జయరామ తెలిపారు.



ఓంకారేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన

మోపిదేవి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : వెంకటాపురంలో అన్నపూర్ణా సమేత ఓంకారేశ్వర స్వామి లక్ష బిల్వార్చన వైభవంగా జరిగింది. ఈవో జె.ప్రవీణ ఆధ్వర్యంలో ఉద్యోగులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు.

న్యాయవాదుల వనసమారాధన



అవనిగడ్డ రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పులిగడ్డ ఇరిగేషన్ అతిథి గృహంలో అవనిగడ్డ న్యాయవాదుల ఆధ్వర్యంలో వనసమారాధన జరిగింది. సీనియర్ సివిల్ జడ్జి బాబూ నాయక్ దంపతులు ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు సనకా రఘురామ ప్రసాద్ పర్యవేక్షించారు.

చల్లపల్లిలో కార్తీక సమారాధన

చల్లపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం సందర్భంగా చల్లపల్లి నారాయణరావునగర్‌లో (విజయవాడరోడ్)ని ప్రసన్న భక్తాంజనేయ స్వామి దేవాలయం వద్ద శనివారం కార్తీక అన్నసమారాధన నిర్వహించారు. చల్లపల్లి ఎస్సై పి.సుబ్రహ్మణ్యం, ఉపసర్పంచ్ ముమ్మనేని నాని అతిథులుగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆలయ కమిటీ పెద్దలు అడపా సాయిబాబు, నర్రా చిన్ని, యడ్ల జగదీష్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

తహసీల్దార్ కార్యాలయంలో మీకోసం..

పెడన, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజా మీ కోసం కార్యక్రమాన్ని మునిసిపల్ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయానికి మార్పు చేసినట్లు కమిషనర్ ఎం. గోపాలరావు తెలిపారు. ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలోనే మీ కోసం అర్జీలు స్వీకరించడం జరుగుతుందన్నారు.

మహిళా సంరక్షణ తక్షణ కర్తవ్యం

కోడూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మహిళల సంరక్షణే తక్షణ కర్తవ్యమని, గుడ్ టచ్ - బ్యాడ్ టచ్‌పై మహిళలు అవగాహన కలిగి ఉండాలని ఎస్సై కె.చాణిక్య అన్నారు. కోట రామయ్య విద్యాసంస్థల విద్యార్థులకు డ్రగ్స్ వినియోగం వల్ల అనర్థాలు, ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ క్రైమ్ వంటి విషయాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కరస్పాండెంట్ కోట వెంకటేశ్వరరావు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

మచిలీపట్నంలో ఏడాదికి వంద పరిశ్రమలు

● ట్రేడ్ సెంటర్ భవనం శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి రవీంద్ర



ట్రేడ్ సెంటర్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి రవీంద్ర, ఎంపీ బాలశౌరి, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల

మచిలీపట్నం టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : బందరు పోర్టు నిర్మాణం పూర్తవుతున్న నేపథ్యంలో మచిలీపట్నంలో ఏడాదికి వంద చిన్న తరహా పరిశ్రమలు నెలకొల్పేందుకు ప్రణాళిక రూపొందించామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. పోతేపల్లి జ్యూయలరీ పార్కులో 1.98 కోట్ల నిధులతో ట్రేడ్ సెంటర్ భవన నిర్మాణానికి శనివారం మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, జనసేన నాయకులు బండి రామకృష్ణ శంకుస్థాపన చేశారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, జ్యూయలరీ పార్కులో ఉత్పత్తి చేసే నగలను ప్రపంచ వ్యాప్తంగా మార్కెటింగ్ చేసేందుకు ట్రేడ్ సెంటర్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఎంఎస్ఎంఈ ప్రోత్సాహంతో 600 మంది పరిశ్రమలు స్థాపించేందుకు ముందుకు వచ్చారన్నారు. ఎంపీ వల్లభనేని బాలశౌరి మాట్లాడుతూ, వేటూరి సుందరరామమూర్తి పేరిట పెదకళ్లేపల్లిలో, ఘంటసాల వెంకటేశ్వరరావు పేరిట ఆయన స్వగ్రామంలోనూ రూ. కోటి వ్యయంతో కల్యాణ మండపాలు నిర్మిస్తున్నామన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ, జ్యూయలరీ పార్కులో 500 కంపెనీలు ఉన్నాయని, 10 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. ఇమిటేషన్ జ్యూయలరీ అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పరిశ్రమ ల శాఖ మేనేజర్ వెంకట్రావు, ఏపీఈడబ్ల్యుఐడీసీ ఈఈ రాయన్న, బీజేపీ నాయకులు సోడిశెట్టి బాలా జీ, గోల్డ్‌ప్రిన్స్ అధినేత, ఇమిటేషన్ జ్యూయలరీ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు చలమలశెట్టి నరసింహారా వు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ, జనసేన నాయకుడు మాదివాడ రాము, టీడీపీ నాయకుడు ఇలియాస్ పాషా, తలశిల సోమశేఖర్, లంకే శేషగిరి, కుంచే నాని తదితరులు పాల్గొన్నారు.